ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు





SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 143 మంగళవారం 12 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-


Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 143 Tuesday 12 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


# ప్రయాణికులకు నరకం చూపిస్తున్న రాపిడో రైడర్స్



- రాత్రి వేళల్లో పెరుగుతున్న ఇబ్బందులు.. నియంత్రణ లేక ప్రజల్లో ఆగ్రహం
- రాపిడో, ఓలా, ఉబర్ సేవలపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత
- రైడ్ క్యాన్సిలేషన్లు.. అదనపు వసూళ్లు.. రాత్రివేళల్లో ప్రయాణికుల అవస్థలు
- నియంత్రణ లేక రైడర్ల ఇష్టారాజ్యం.. ప్రభుత్వ జోక్యం కోరుతున్న ప్రజలు

ప్రత్యేక కథనం వార్త సంధ్య : హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో "సౌకర్యవంతమైన ప్రయాణం" పేరుతో విస్తరించిన రాపిడో , ఓలా,ఉబర్ వంటి యాప్ ఆధారిత రవాణా సేవలు ఇప్పుడు ప్రజలకు తలనొప్పిగా మారుతున్నాయి. తక్షణ ప్రయాణం, తక్కువ ధరలు, సురక్షిత సేవలు అంటూ ప్రారంభమైన ఈ సంస్థల సేవలపై ప్రస్తుతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఆటో, బైక్, కార్ రైడర్లు వ్యవహరిస్తున్న తీరు ప్రయాణికులను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైడ్ యాక్సెప్ట్ చేసి కొద్ది నిమిషాల్లోనే క్యాన్సిల్ చేయడం, ఫోన్ చేసి గమ్యస్థానం అడిగి తమకు నచ్చకపోతే రద్దు చేయడం, యాప్‌లో చూపించిన మార్గం కాకుండా రోడ్లపై తిరుగుతూ ప్రయాణికుల సమయాన్ని వృథా చేయడం సాధారణంగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగాలకు వెళ్లేవారు, విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లాల్సిన వారు, అత్యవసర ప్రయాణాల్లో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రాత్రి 10 గంటల తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. "రాత్రి టైమ్", "రిటర్న్ దొరకదు", "దూరం ఎక్కువ" అంటూ అదనపు డబ్బులు డిమాండ్ చేయడం పెరిగిపోయిందని ఆరోపిస్తున్నారు. మహిళా ప్రయాణికులు, రాత్రి షిఫ్ట్ ఉద్యోగులు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైడర్లు క్యాష్ అయితేనే వస్తామని చెప్పడం, అదనపు డబ్బులు ఇవ్వకపోతే రైడ్ క్యాన్సిల్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఆటోల్లో ఎంతమంది ప్రయాణించాలి అన్న విషయంలో కూడా స్పష్టత లేకపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. "ఫోర్ ఇన్ ఆల్" అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ నాలుగో వ్యక్తి ఎక్కితే అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. చిన్న లగేజ్ ఉన్నా "లగేజ్ ఛార్జ్" పేరుతో డబ్బులు అడగడం సాధారణమైందని విమర్శిస్తున్నారు. ఇంకా తీవ్ర విమర్శలకు గురవుతున్న అంశం ఫిర్యాదు వ్యవస్థ. ప్రయాణికుడు సమస్య ఎదుర్కొంటే వెంటనే స్పందించే కస్టమర్ సపోర్ట్ లేకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. యాప్‌లో "హెల్ప్" ఆప్షన్ ఉన్నప్పటికీ వాస్తవంగా సమస్య పరిష్కారం కావడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. రైడర్ తప్పు చేసినా ప్రయాణికుడికే పెనాల్టీలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





### 1. రైడ్ యాక్సెప్ట్ చేసి క్యాన్సిల్ చేస్తున్న రైడర్స్ ప్రయాణికుల సమయం వృథా

ప్రస్తుతం నగరాల్లో వేగవంతమైన రవాణా పేరుతో విస్తరించిన బైక్ టాక్సీ, ఆటో సేవలు ప్రజలకు ఒకవైపు సౌకర్యంగా మారినప్పటికీ మరోవైపు తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఝజూఆసశీ, ఖఎవతీ, రాశ్రీఝ వంటి సంస్థల రైడర్స్ వ్యవహరిస్తున్న తీరు ప్రయాణికులను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. యాప్‌లో రైడ్ యాక్సెప్ట్ చేసిన తర్వాత వెంటనే క్యాన్సిల్ చేయడం ఇప్పుడు సాధారణంగా మారిపోయింది. కొంతమంది రైడర్స్ రైడ్ అంగీకరించిన తర్వాత ఫోన్ చేసి "ఎక్కడికి వెళ్తారు?", "ఎంత మంది?", "లగేజ్ ఉందా?" వంటి ప్రశ్నలు అడిగి తమకు అనుకూలంగా లేకపోతే రద్దు చేస్తున్నారు. ఇది అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రయాణికులకు పెద్ద తలనొప్పిగా మారుతోంది. ఆస్పత్రికి వెళ్లాల్సిన వారు, ఉద్యోగాలకు ఆలస్యమవుతున్న వారు, రైల్వే స్టేషన్ లేదా బస్ స్టాండ్ చేరాల్సిన వారు ఇలాంటి క్యాన్సిలేషన్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వరుసగా మూడు నుంచి నాలుగు రైడ్స్ క్యాన్సిల్ కావడంతో గంటల తరబడి రోడ్డుపై వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైడర్స్ క్యాన్సిల్ చేస్తే వారికి ఎటువంటి కఠిన చర్యలు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత పెరుగుతోంది. కానీ అదే సమయంలో ప్రయాణికుడు రెండు లేదా మూడు సార్లు రైడ్ రద్దు చేస్తే యాప్‌లో పెనాల్టీ విధించడం, అదనపు ఛార్జీలు వేయడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. రైడర్ తప్పు చేసినా ప్రయాణికుడే నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికుల సమయానికి విలువ లేకుండా వ్యవహరించడం, యాప్‌లో చూపించే సమయాలకు భిన్నంగా రోడ్లపై తిరుగుతూ వేచి పెట్టడం వంటి ఘటనలు ప్రతిరోజూ జరుగుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నాలజీ ఆధారిత సేవల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### 2. రాత్రి 10 తర్వాత పరిస్థితి దారుణం మహిళలు, ఉద్యోగులు భయాందోళన

రాత్రి 10 గంటల తర్వాత నుంచి ఉదయం 6 గంటల వరకు పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, ఐటీ ఉద్యోగులు, రాత్రి షిఫ్ట్ సిబ్బంది, విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో రైడర్స్ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యాప్‌లో చూపించే ధరకు రైడ్ అంగీకరించిన తర్వాత "రాత్రి టైమ్ కాబట్టి ఎక్స్‌ట్రా ఇవ్వాలి", "డబుల్ రేట్ ఇవ్వాలి", "లోకేషన్ దూరంగా ఉంది" అంటూ అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. కొందరు రైడర్స్ ఫోన్ చేసి "క్యాష్ ఇస్తేనే వస్తాం" అని చెప్పడం, లేదంటే రైడ్ క్యాన్సిల్ చేయడం సాధారణంగా మారిపోయింది. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే సమయంలో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైడ్ యాక్సెప్ట్ చేసిన వాహనం వేరే ప్రాంతాల్లో తిరుగుతూ యాప్‌లో కనిపించడం, ఫోన్ ఎత్తకపోవడం వంటి అంశాలు భయాందోళనలకు కారణమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రైడర్స్ ప్రయాణికులను మధ్యలో దింపేయడం, ఎక్కువ చార్జ్ కోసం ఒత్తిడి చేయడం వంటి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అనుమతించిన సేవలు అయినప్పటికీ వీటిపై పర్యవేక్షణ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించినా దీర్ఘకాలిక పరిష్కారం కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధానం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అదే విధంగా మహిళల భద్రత దృష్ట్యా ూూూ బటన్, లైవ్ ట్రాకింగ్, రైడర్ వెరిఫికేషన్ వంటి అంశాలను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

### 3. నాలుగో వ్యక్తి, లగేజ్ పేరుతో అదనపు వసూళ్లు నియమాలు ఎక్కడ?

ఆటో రైడ్స్ విషయంలో స్పష్టమైన నియమాలు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్రంగా నష్టపోతున్నారు. "ఫోర్ ఇన్ ఆల్" అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ నాలుగో వ్యక్తి ఎక్కితే అదనపు డబ్బులు డిమాండ్ చేయడం సాధారణంగా మారింది. అలాగే చిన్న లగేజ్ ఉన్నా "లగేజ్ ఛార్జ్" పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రయాణికుల పరిమితి, యాప్ సంస్థలు పేర్కొంటున్న నియమాలు, రైడర్స్ అమలు చేస్తున్న విధానం ఈ మూడింటిలో ఎటువంటి స్పష్టత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. యాప్‌లో ఒక ధర చూపించి రైడ్ ప్రారంభమైన తర్వాత "ఇది ఎక్స్‌ట్రా", "అది అదనంగా" అంటూ వసూలు చేయడం వల్ల ప్రయాణికులు మోసపోతున్న భావన కలుగుతోంది. చాలా సందర్భాల్లో ప్రయాణికులు వాదిస్తే రైడర్స్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. "వెళ్లాలంటే వెళ్లండి లేదంటే దిగిపోండి" అనే ధోరణి పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా కుటుంబాలతో ప్రయాణించే వారు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల అవసరాన్ని బట్టి డిమాండ్ చేయడం ఇప్పుడు ఒక వ్యాపార ధోరణిగా మారిందని విమర్శలు వస్తున్నాయి. వర్షం పడితే వేరే రేటు, ట్రాఫిక్ ఉంటే వేరే రేటు, రాత్రి అయితే ఇంకో రేటు ఇలా పరిస్థితిని బట్టి డబ్బులు అడగడం నియంత్రణ లేకపోవడాన్ని స్పష్టంగా చూపిస్తోంది. రవాణా రంగంలో పనిచేసే సంస్థలు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ఒక ఆటోలో ఎంతమంది ప్రయాణించాలి? ఎంత లగేజ్ అనుమతించాలి? అదనపు ఛార్జీలు ఎప్పుడు వర్తిస్తాయి? వంటి అంశాలను యాప్‌లోనే స్పష్టంగా చూపించాలి. అదే విధంగా వాటిని ఉల్లంఘించే రైడర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### 4. ఫిర్యాదు వ్యవస్థ బలహీనత వినియోగదారుడికి న్యాయం ఎక్కడ?

ప్రస్తుతం యాప్ ఆధారిత రవాణా సేవల్లో ప్రధాన సమస్యల్లో ఒకటి ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ బలహీనంగా ఉండటమే. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వెంటనే స్పందించే వ్యవస్థ లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. యాప్‌లో "హెల్ప్" లేదా "సపోర్ట్" ఆప్షన్ ఉన్నప్పటికీ వాస్తవంగా సమస్య పరిష్కారం కావడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. రైడర్ అదనపు డబ్బులు అడిగినా, రైడ్ క్యాన్సిల్ చేసినా, అసభ్యంగా ప్రవర్తించినా, ఎక్కువ సమయం వేచి పెట్టినా వెంటనే మాట్లాడేందుకు కాల్ సెంటర్ సదుపాయం లేకపోవడం పెద్ద లోపంగా మారింది. చాలాసార్లు ఆటోమేటెడ్ మెసేజ్‌లు మాత్రమే వస్తుండటంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ప్రయాణికుడి ఫిర్యాదును పూర్తిగా పరిశీలించకుండా "×ంంబవ =వంశీశ్రీజవం" అని చూపించడం, రిఫండ్ ఇవ్వకపోవడం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రైడర్ తప్పు చేసినా ప్రయాణికుడికే తక్కువ రేటింగ్ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో రైడ్స్ దొరకకపోవడం వంటి సమస్యలు కూడా వస్తున్నాయి. ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో కనీసం అధికారులను సంప్రదించే అవకాశం ఉంటుంది. కానీ యాప్ ఆధారిత కార్పొరేట్ సేవల్లో వినియోగదారుడు పూర్తిగా యాప్‌పై ఆధారపడాల్సి వస్తోంది. ఇది వినియోగదారుల హక్కులకు విరుద్ధమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక వినియోగదారుల ఫిర్యాదు సెల్ ఏర్పాటు చేయాలని, రవాణాశాఖ ఆధ్వర్యంలో యాప్ రైడ్ సేవలను పర్యవేక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైడర్ తప్పు నిరూపితమైతే భారీ జరిమానాలు విధించడం, పునరావృతమైతే అకౌంట్ సస్పెండ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### 5. ప్రభుత్వం జోక్యం అవసరం స్పష్టమైన విధానాలు ఎప్పుడొస్తాయి?

యాప్ ఆధారిత రవాణా వ్యవస్థ ప్రస్తుతం కోట్లాది ప్రజల దైనందిన జీవితంలో భాగమైంది. కానీ దీనికి అనుగుణంగా కఠినమైన నియంత్రణ వ్యవస్థ మాత్రం ఇంకా రూపుదిద్దుకోలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రయాణికుల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంస్థలు "టెక్నాలజీ ప్లాట్‌ఫామ్" పేరుతో పనిచేస్తున్నప్పటికీ వాస్తవానికి ప్రజా రవాణా సేవలే అందిస్తున్నాయి. అందువల్ల వీటిపై ప్రభుత్వ పర్యవేక్షణ తప్పనిసరి కావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఛార్జీల నియంత్రణ, రైడ్ క్యాన్సిలేషన్ పాలసీ, ప్రయాణికుల భద్రత, ఫిర్యాదు పరిష్కారం వంటి అంశాల్లో స్పష్టమైన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రతి రైడర్‌కు ప్రవర్తనా నియమావళి తప్పనిసరి చేయాలి. ప్రయాణికులతో ఎలా మాట్లాడాలి, అదనపు డబ్బులు అడగకూడదు, అనవసర క్యాన్సిలేషన్లు చేయకూడదు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలి. అలాగే రైడర్ పనితీరును ఆధారంగా చేసుకుని లైసెన్సింగ్ వ్యవస్థను కఠినతరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రయాణికుడి సమయానికి విలువ ఇవ్వడం, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, పారదర్శక ఛార్జీల వ్యవస్థ అమలు చేయడం అత్యవసరం. లేదంటే ప్రజల్లో ఈ సేవలపై నమ్మకం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు, వినియోగదారుల సంఘాలు కలిసి సమగ్ర విధానం రూపొందిస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. లేకపోతే "సౌకర్యవంతమైన ప్రయాణం" పేరుతో ప్రారంభమైన ఈ వ్యవస్థ ప్రజలకు "నరకయాతన"గా మారే ప్రమాదం ఉందని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి.



ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 143 మంగళవారం 12 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 143 Tuesday 12 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


# కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తమతో కలిసి రావాలని రేవంత్ కు చెప్పిన మోదీ
- తమతో కలిసి రావాలన్న మోదీ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి స్పందన
- కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న రేవంత్
- ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవసరమని వ్యాఖ్య



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 11 :**
రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాలను పక్కన పెట్టి కేంద్రంతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'గుజరాత్ కు ఇచ్చినంత తెలంగాణకు కూడా ఇస్తాం. మాతో కలిసిరండి' అని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ, పార్టీల ఐడియాలజీలు వేరైనా ప్రజల సంక్షేమం కోసం 'గివ్ అండ్ టేక్' (ఇచ్చిపుచ్చుకునే) ధోరణి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విజన్ 2047, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాలను చేరుకోవడానికి కేంద్రంతో కలిసి నడుస్తామని రేవంత్ చెప్పారు. ఎన్నోసార్లు కలిసినా కేంద్ర నుంచి ఆశించిన మద్దతు రాలేదని రేవంత్ అన్నారు. ప్రధాని 2 గంటల పాటు సమయం ఇస్తే తమ ప్రణాళికలను వివరిస్తామని చెప్పారు. - మిగతా 3 లో

# మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు




- నెల రోజుల పాటు వాడవాడలా టీఆర్ఎస్ జెండా పండుగలు
- రాజధాని నుంచి గ్రామస్థాయి వరకు జెండా పండుగ
- పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెండా పండుగ

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 11 :**
తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా - మిగతా 3 లో


3 లో

## బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదు

- స్పందించిన తెలంగాణ బీజేపీ చీఫ్
- బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని స్పష్టీకరణ
- ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని వ్యాఖ్య
- బండి సంజయ్ కుటుంబ ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్న బీజేపీ చీఫ్

# కొండెక్కిన కోడి ధరలు




- రూ.300 దాటిన కిలో చికెన్ రేటు
- ఈ నెలలో రూ.260 నుంచి రూ.320కి చేరిన ధర
- అధిక డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు వల్ల చనిపోతున్న కోళ్లు
- ఇంతలా చికెన్ ధర పెరిగితే కొనలేమంటున్న సామాన్య ప్రజలు

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 11 :**
సండే వచ్చిందంటే చాలు అందరి కళ్లు చికెన్‌వైపే వెళ్తాయి. ప్రతి వీధిలోనూ చికెన్ తాలూకు ఘుమఘుమలు నోరూరిస్తుంటాయి. ఆదివారం ముక్క లేనిదే ముద్ద దిగని నాన్‌వెజ్ ప్రియులు ఎందరో. మాంసం నోట్లోకి వెళ్లకపోతే ఆదివారం వచ్చిందనే సంతృప్తి ఉండకపోగా, రోజుని ఎంజాయ్ చేయలేదనే భావనలో ఉండిపోతారు చాలా మంది. అంతలా - మిగతా 3 లో

## జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం

- గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ
- కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు అంతరాయం కలగకుండా చర్యలు
- కొత్త కార్డులు జారీ అయ్యే వరకు ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటు


3 లో

# ఒక రోజు సీఎంగా.. మరో రోజు ఎమ్మెల్యేగా

- ఆసక్తిగా మారిన విజయ్ ప్రమాణ స్వీకారం
- తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే ఎమ్మెల్యేగా విజయ్ ప్రమాణ స్వీకారం
- సీఎంగా 'దేవుడిపై ప్రమాణం'.. ఎమ్మెల్యేగా 'మనస్సాక్షిగా ధ్రువీకరిస్తున్నాను' అంటూ ప్రమాణం
- పెరంబూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ, తిరుచి ఈస్ట్ స్థానానికి రాజీనామా
- తొలిసారి అసెంబ్లీకి హాజరైన టీవీకే సభ్యులు.. కొత్త ప్రభుత్వానికి ప్రొటెం స్పీకర్ సూచనలు
- ప్రజాసేవకే ప్రాధాన్యత ఇవ్వాలని కొత్త ఎమ్మెల్యేలకు పిలుపు



**వార్త సంధ్య, చెన్నై, మే 11 :**
తమిళనాడు ముఖ్యమంత్రిగా నిన్న ప్రమాణ స్వీకారం చేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత సి. జోసెఫ్ విజయ్, నేడు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. కొత్తగా ఏర్పాటైన 17వ తమిళనాడు అసెంబ్లీ తొలి సమావేశాల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రొటెం స్పీకర్ కరుప్పియా నూతనంగా ఎన్నికైన - మిగతా 3 లో


3 లో

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

- అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- 1998 పోఖ్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు
- సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని
- సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి

## తెలంగాణకు హెచ్చరిక.. 47 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు

- తెలంగాణలో మంగళవారం నుంచి మళ్లీ పెరగనున్న ఉష్ణోగ్రతలు
- తూర్పు తెలంగాణలో 47 డిగ్రీలకు చేరే అవకాశం
- రాబోయే పది రోజుల పాటు పలు జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు

3 లో..


3 లో

## అమిత్ షాతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఢిల్లీ పర్యటనలో బిజీగా గడుపుతున్న చంద్రబాబు
- విభజన హామీలపై అమిత్ షాతో కీలక చర్చ
- అమరావతిలో మరిన్ని కేంద్ర సంస్థలను ఏర్పాటు చేయాలని విన్నపం

# 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం



- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- ఏపీని కరవు రహితంగా మార్చడంలో పోలవరం కీలకమన్న నిమ్మల
- గోదావరి, కావేరి అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడి
- గోదావరి నుంచి ప్రతి ఏటా 3 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్న మంత్రి

**వార్త సంధ్య, అమరావతి, మే 11 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ గడువుపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువు ప్రకారం 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలిసి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని తెలిపారు. గత ఏప్రిల్ నాటికే కొత్త - మిగతా 3 లో

# గోదావరి పుష్కరాలలోపు పోలవరం పూర్తికి సహకరించాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఢిల్లీలో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశం
- పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు నిధులు మంజూరు చేయాలని పాటిల్‌కు వినతి
- 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తికి సాయం కోరిన సీఎం
- పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- చెరువుల ఆధునీకరణకు రూ. 285 కోట్లు విడుదల చేయాలని వినతి




**వార్త సంధ్య, అమరావతి, మే 11 :**
2027 గోదావరి పుష్కరాలలోపు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పర్యటిస్తున్న చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో వరుస భేటీలు అయ్యారు. తొలుత పార్టీ ఎంపీలతో సమావేశమై, ఢిల్లీలో వివిధ శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. తొలి దశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను చంద్రబాబు కోరారు. ఇప్పటికే తాను స్వయంగా 5 సార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని - మిగతా 3 లో


3 లో

## నేడు అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్

- పామిడిలో ఒక వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరుకానున్న జగన్
- అనంతరం తాడేపల్లికి బయల్దేరనున్న వైసీపీ అధినేత
- జగన్ రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న వైసీపీ శ్రేణులు

# సంపాదకీయం

## నివ్వెరపరిచే ఆదేశాలు!



కొన్ని ఉదంతాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. వింటున్నది నిజమేనా అనిపిస్తాయి. ఒరిస్సా హైకోర్టు కొన్ని బెయిల్ దరఖాస్తుల విషయంలో వెలువరించిన ఆదేశాలు అటువంటివే. నిరుడు ఏప్రిల్ సెప్టెంబర్‌ల మధ్య ఆ హైకోర్టు 50 బెయిల్ దరఖాస్తుల్ని అంగీకరించింది. కానీ అందుకు సంబంధించి విధించిన షరతులు అందరినీ నివ్వెరపరిచాయి. ఆ నిందితులంతా రెండు నెలలపాటు పోలీస్‌స్టేషన్లు, గుడులు, ఆసుపత్రులు, గ్రామీణ రహదారులు, చెరువులు ప్రతిరోజూ ఉదయం మూడు గంటలపాటు శుభ్రం చేయాలన్నది వాటి సారాంశం. మైనింగ్ కార్యకలాపాలు నిలిపేయాలంటూ ఉద్యమించిన వారితోపాటు దొంగతనం, హత్య తదితర క్రిమినల్ కేసుల్లో ఉన్నవారిని కూడా ఇందులో చేర్చారు. నిందితుల్లో అత్యధికులు దళిత, ఆదివాసీ వర్గాలకు చెందినవారు కావటం గమనించదగ్గది. ఇలాంటి పారిశుద్ధ్య పనుల కేటాయింపులో న్యాయమూర్తి కులం కోణాన్ని మించి చూడలేకపోయారని ఈ బెయిల్ ఆదేశాలు తేటతెల్లం చేస్తున్నాయి. సాధారణంగా సామాజిక ఉద్యమకారులెవరైనా ఫిర్యాదు చేస్తేనే ఇలాంటి ఉదంతాలు న్యాయస్థానం దృష్టికి పోతాయి. కానీ 'ఆర్టికల్ 14' అనే డిజిటల్ మీడియాలో గత నెల 27న వచ్చిన కథనాలను సర్వోన్నత న్యాయస్థానం తనంత తానే గమనించటం, ఆ షరతులు చెల్లబోవని వెనువెంటనే ఉత్తర్వులీయటం కొంతలో కొంత ఊరట. 'కులం పునాదుల మీద మీరు దేన్నీ సాధించలేరు. ఒక జాతినీ నిర్మించలేరు. ఒక నీతినీ నిర్మించలేరు' అన్నారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. వచ్చే ఏడాదితో మన దేశం స్వాతంత్ర్యాన్ని సాధించుకుని ఎనభైయ్యేళ్లవుతుంది. కానీ దళితులకు, ఇతర అట్టడుగు వర్గాలకూ అడుగడుగునా కులవివక్ష ఎదురవుతూనే ఉంది. కేలండర్లు మారుతున్నా, సాంకేతికత విస్తరించి అభివృద్ధి జరుగుతున్నా ఆ మనస్తత్వం మారటం లేదు. కుల వివక్ష, దానిపేరిట సాగుతున్న హింస దేశాభివృద్ధికే ఆటంకంగా ఉన్నదనీ, అది మనుషులను వేరు చేస్తోందనీ, మనసుల్ని సంకుచితపరుస్తోందనీ స్వామి వివేకానంద ఏనాడో ఆందోళన వ్యక్తం చేశారు. కానీ మార్పు ఎక్కడ?ఇతర వ్యవస్థల్లో ఇలాంటి జాడ్యాలు కనబడినప్పుడు సరిదిద్దాల్సిన న్యాయవ్యవస్థ సైతం ఆ తానులో ముక్కగా మారితే...? ఒరిస్సా హైకోర్టు ఆదేశాలు చూసి రాయగడ అదనపు సెషన్స్ న్యాయస్థానం, మరో ఆరు కింది కోర్టులు ఈ మాదిరి ఆదేశాలే జారీ చేశాయి. 'ఒడిశా న్యాయవ్యవస్థ వ్యక్తీకరించిన ఈ తిరోగమన మనస్తత్వం మమ్మల్నెంతో కలవరపరుస్తోంది. ఇది మానవ హక్కుల్ని ఉల్లంఘించటమేకాక నిందితుల గౌరవాన్ని దెబ్బతీసే చర్య' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జయ్‌మాలా బాగ్చీ ఆధ్వర్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్మొహమాటంగా తెలిపింది. విచారణకు ముందే నేరం చేసినట్టు నిర్ణయానికొచ్చి 'శిక్షించటం' అమల్లోవున్న చట్టాల ప్రకారం చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది.బాక్సైట్ మైనింగ్ కోసం వేదాంత గ్రూప్ సంస్థలకు రాయగడ, కలహండి జిల్లాల్లో ఇచ్చిన లీజులవల్ల తూర్పు కనుమల్లోని 1560.40 హెక్టార్ల అటవీభూమి నాశనం కాబోతోంది. రెండు జిల్లాల్లోని రెండు గ్రామాలు అదృశ్యమవుతాయి. ఆదివాసీ, దళిత వర్గాలు ఈ లీజుల రద్దుకు 2023 నుంచి ఉద్యమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 201419 మధ్య చంద్రబాబు ప్రభుత్వం సైతం విశాఖ ఏజెన్సీలో ఇలాగే లీజుకీయటం, ఉద్యమాలు చెలరేగటం ఎవరూ మరిచిపోరు. అటు తర్వాత వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ అనుమతుల్ని రద్దు చేసింది. ప్రకృతి విధ్వంసానికి దారితీసే, స్థానికుల జీవికను దెబ్బతీసే ఇలాంటి చర్యను ఒడిశా సర్కారు విరమించుకోకపోగా, ఉద్యమకారుల్ని నిర్బంధిస్తోంది. సకాలంలో జోక్యం చేసుకోకుండా వ్యవస్థలు నిర్లిప్తంగా మిగిలితే ఉద్యమాలు హింసాత్మక రూపం ధరిస్తాయి. వాటిని ప్రభుత్వాలు శాంతిభద్రతల సమస్యగా పరిగణించి అణచ టానికి చూస్తాయి. నక్సలైటు ఉద్యమాల తీవ్రత, పర్యవసానాలు చూశాకైనా ఈ పోకడలు మానుకొని, స్థానికుల ఆకాంక్షల్ని గౌరవించే సంస్కృతిని వ్యవస్థలు అలవర్చుకోవాలి. ఈ విషయంలో ఒరిస్సా హైకోర్టు తీరు ఆందోళన కలిగించే అంశం. ఈ సమస్యపట్ల సుప్రీంకోర్టు ప్రదర్శించిన అప్రమత్తత, దిద్దుబాటు చర్యలు నిస్సహాయ పౌరులకు వ్యవస్థలపట్ల విశ్వాసాన్ని పెంచుతాయి.

## 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం

మొదటిపేజీ తరువాయి - డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తవ్వడం ప్రాజెక్టు నిర్మాణం వేగానికి సంకేతమని పేర్కొన్నారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేలా నిర్మాణ పనులకు పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరినట్టు నిమ్మల తెలిపారు.ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు. గోదావరి-కావేరి అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. ప్రతి ఏటా గోదావరి నుంచి సుమారు 3000 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని, ఈ నీటిని మళ్లించడం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. దీనికి సంబంధించి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం విజయనగరంలో ప్రయోగాత్మకంగా ఎంసీఏడీ మోడల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## అమిత్ షాతో భేటీ అయిన చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో బిజీగా గడుపుతున్నారు. తన పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం మరియు రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం నుంచి మరింత నిధుల సహకారం కావాలని, అలాగే రాజధాని ప్రాంతంలో మరిన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. అమరావతిలో ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని వివరించిన ఆయన, కేంద్రం నుంచి సత్వరమే మరిన్ని సంస్థలు వస్తే రాజధాని ప్రాంతం ఆర్థికంగా వేగంగా పుంజుకుంటుందని అమిత్ షాకు వివరించారు.రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిధుల అంశం కూడా ఈ చర్చల్లో ప్రముఖంగా వినిపించింది. పోలవరం పనులు జాప్యం కాకుండా చూసేందుకు నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు, కేంద్ర సహకార శాఖ నుంచి ఏపీకి మరింత మద్దతు లభిస్తే, రాష్ట్రంలోని రైతులకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గొప్ప వెసులుబాటు కలుగుతుందని చంద్రబాబు ప్రతిపాదించారు. విభజన చట్టంలోని మిగిలిన పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించాలని కోరుతూ ఆయన ఒక సమగ్ర నివేదికను అందించారు.

## నేడు అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్

మొదటిపేజీ తరువాయి - వైసీపీ అధినేత జగన్ నేడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత ఆయన చేపడుతున్న మొదటి జిల్లా పర్యటన ఇదే కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.నేటి మధ్యాహ్నం ఆయన అనంతపురం జిల్లాలోని పామిడికి చేరుకుంటారు. ఎమ్మెల్సీ మధుసూదన్ కుమారుడు చైతన్య మిత్ర, వైసీపీ నేత పామిడి వీరా కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ లిఖితల వివాహ రిసెప్షన్ వేడుకకు ఆయన హాజరుకానున్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలోని పామిడిలో నిర్వహించనున్న ఈ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులను జగన్ ఆశీర్వదించనున్నారు.జగన్ రాకను పురస్కరించుకుని పామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పార్టీ కీలక నేతలందరూ ఈ వేడుకకు తరలివచ్చే అవకాశం ఉంది. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తాడేపల్లికి బయల్దేరుతారు.

## జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం

మొదటిపేజీ తరువాయి - జీవనోపాది భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జులై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది.దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ-కేవైసీ ఎంజీఎన్‌రేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర అంశాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.

# గోదావరి పుష్కరాలలోపు పోలవరం పూర్తికి సహకరించాలి

మొదటిపేజీ తరువాయి - సమీక్షించినట్టు వివరించారు. 2026 ఏప్రిల్ 2 నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని చెప్పారు. గ్యాప్ 1, గ్యాప్ 2లో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉండటంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్రమంత్రిని చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు.సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాల్వల సామర్థ్యం 17,500 క్యూసెక్కులకు పెంచామన్నారు. కాల్వల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీఎంబర్స్ చేయాలని అన్నారు. ప్రాజెక్టు తదుపరి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ పథకాల పునరుద్ధరణకు నిధుల మంజూరు కోరుతూ లేఖ రాశారు.రాష్ట్రవ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణకు రూ.285 కోట్ల నిధుల విడుదలకు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. సుప్రీం తీర్పు వచ్చేవరకూ ఆలమట్టి ఎత్తుపై గెజిట్ విడుదల చేయవద్దని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 524.25 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని తెలిపారు.పోలవరం




బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరుకు సీఎం చేయాలని కేంద్రమంత్రిని కోరారు. వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా ప్రాజెక్టు చేపడుతున్నట్టు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి గెజిట్ ప్రకారం ముందుకెళ్తామన్నారు. 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని అన్నారు. అవసరమైన భూసేకరణకు ఒడిశాను ఆదేశించాల్సిందిగా పాటిల్‌కు సీఎం చంద్రబాబు లేఖ ఇచ్చారు.సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్రమంత్రి పాటిల్‌తో భేటీ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కరవు రహితంగా మార్చే ప్రాజెక్టు పోలవరమని అన్నారు. కేంద్రం అందిస్తున్న సహకారానికి మంత్రి నిమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి కానుందని పేర్కొన్నారు. ప్రధాని చేతుల మీదుగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. వైఎస్సార్సీపీ పట్టించుకోని తుంగభద్రకు మొత్తం గేట్లను కొత్తవి నిర్మిస్తున్నామని అన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం యాక్షన్ ప్లాన్ తయారీపై కేంద్రమంత్రి పాటిల్‌తో చర్చించామని నిమ్మల వెల్లడించారు.దిల్లీ పర్యటనలో భాగంగా అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. విభజన చట్టంలోని పెండింగ్ హామీల్లో పెండింగ్ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అమరావతిలో మరిన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుపై పలు ప్రతిపాదనలు అందించినట్లు తెలిసింది. ముఖ్యంగా గత ఐదేళ్లలో రాష్ట్రానికి రావలసిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, కోఆపరేటివ్ శాఖ నుంచి రాష్ట్రానికి మరింత సహకారంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరారు. అమరావతి పనుల పురోగతిని వివరించి నిధుల సహకారం పెంచాలని విజ్ఞప్తి చేశారు.

# కొండెక్కిన కోడి ధరలు



మొదటిపేజీ తరువాయి - ప్రేమించే చికెన్ ధరలు ఇప్పుడు కొండెక్కి కూర్చున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో 'చికెన్ లవర్స్' చాలా ఇబ్బంది పడుతున్నారు.గత వారం రోజుల నుంచి ధరలను చూస్తే క్రమక్రమంగా పెరుగుతూ కనిపిస్తున్నాయి. ఈ నెల 6న స్కిన్‌తో ఉండే చికెన్ కిలో రూ.260 ఉండేది. కానీ ఇప్పుడు రూ.310 నుంచి రూ.320కు పెరిగింది. దీనివల్ల చికెన్ ప్రియులు కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుంది. కొందరైతే కొనాలంటే భయపడుతున్నారు. రెండు కిలోలు తీసుకునే వారు ఒక కిలోతో, ఒక కిలో కావాలనుకునే వారు అర కిలోతో సరిపెట్టుకుంటున్నారు. జూన్ నెల ఆఖరు వరకు ధరలు ఇలాగే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా బాయిలర్ కోడి పిల్లలను పెంచుతున్న ఫారాలు దాదాపుగా 200 వరకు ఉన్నాయి. దీనివల్ల 30 లక్షల వరకు కోడిపిల్లలు ఉత్పత్తి అవుతున్నాయి. వర్షాకాలం, చలికాలం కోడి పిల్లల ఉత్పత్తిలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ ఎండాకాలం వచ్చేసరికి మాత్రం అధిక ఉష్ణోగ్రతలను బాయిలర్ కోళ్లు తట్టుకోవడం లేదు. ఎండ వేడిమి, ఉక్కపోత తట్టుకోలేక మృత్యువాతపడుతున్నాయి. ఇలా కోళ్లు చనిపోకుండా ఉండేందుకు ఫారాల చుట్టూ జాలీలకు తట్లు ఏర్పాటు చేసి, వాటిపై నీళ్లు చల్లుతుంటారు. అయినా ఆ ప్రయత్నాలు ఫలితమివ్వడం లేదు."ఎండాకాలంలో వేడిని తట్టుకోలేక బ్రాయిలర్ కోడి పిల్లలతో పాటు, మంచిగా ఎదిగిన కోళ్లు కూడా చనిపోతున్నాయి. ఉత్పత్తి అయ్యే 30 లక్షలకు గానూ ప్రస్తుతం 15 నుంచి 18 లక్షల వరకే ఉత్పత్తి అవుతున్నాయి. ఇంకా అందులో కొన్ని చనిపోతున్నాయి. దీంతో చాలా మంది రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఖమ్మంకు కోళ్లు ఎగుమతి జరిగేవి. ప్రస్తుతం అది ఆగిపోయింది. ఇపుడు మన జిల్లావి మనకే సరిపోవడం లేదు. దీనివల్ల ధర పెరుగుతూ పోతోంది "- సుబ్రహ్మణ్యం, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ కమిటీ సభ్యుడువేసవి కాలం వచ్చిందంటే ఒక ఫాంలో 20 వేల వరకు మాత్రమే పెంచుతారు. ఎండాకాలం కోడి పిల్లల ధరలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఒక్కో కోడి పిల్ల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉంటుంది. అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం వల్ల కోడిపిల్లలు చనిపోతుంటాయి. దీంతో నేచురల్‌గానే బాయిలర్ కోళ్ల కొరత అనేది ఏర్పడుతుంది. దానివల్ల చికెన్ ధరలు పెరుగుతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోతుంది. మరోవైపు చికెన్ ధరలు ఇలా పెరుగుతూ పోతే ఎలా అంటూ మాంసం ప్రియులు ఆవేదన చెందుతున్నారు. చికెన్ ధరలు తగ్గుముఖం పట్టి, సాధారణ స్థితికి ఎప్పుడు వస్తాయోనని దిగులు చెందుతున్నారు.

# ఒక రోజు సీఎంగా.. మరో రోజు ఎమ్మెల్యేగా

మొదటిపేజీ తరువాయి - శాసనసభ్యులందరితో ప్రమాణం చేయించారు.సీఎం విజయ్ తన ప్రమాణ స్వీకారంలో రెండు విభిన్న పద్ధతులు పాటించడం చర్చనీయాంశమైంది. సీఎంగా ప్రమాణం చేసేటప్పుడు "ఆండవన్ మీదు ఆనైయగ" (దేవుడిపై ప్రమాణంగా) అని చెప్పిన ఆయన, సోమవారం ఎమ్మెల్యేగా ప్రమాణం చేసేటప్పుడు మాత్రం "ఉలమార ఉరుది కూరుగిరేన్" (మనస్సాక్షిగా ధ్రువీకరిస్తున్నాను) అని రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేశారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పెరంబూర్, తిరుచి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి గెలుపొందారు. ఆయన పెరంబూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకుని, తిరుచి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. విజయ్ ప్రమాణం చేసిన వెంటనే, టీవీకే సీనియర్ నేత ఎన్. ఆనంద్ (టి. నగర్), ఆధవ్ అర్జున (విల్లివాక్కం) కూడా ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. తొలిసారి అధికారంలోకి రావడంతో టీవీకే సభ్యులు ఎంతో ఉత్సాహంగా సభలో అడుగుపెట్టారు.ఈ సందర్భంగా ప్రొటెం స్పీకర్ కరుప్పియా మాట్లాడుతూ కొత్త సభ్యులకు అభినందనలు తెలిపారు. అనేక సవాళ్లను అధిగమించి కొత్త నాయకత్వం



ప్రజల నమ్మకాన్ని గెలుచుకుందని ప్రశంసించారు. "ప్రజలు మనల్ని సేవ చేయడానికి ఎన్నుకున్నారు. ఈ బాధ్యతను ప్రతి సభ్యుడు గుర్తించి చిత్తశుద్ధితో పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పెరియార్, కామరాజర్, వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ వంటి గొప్ప నేతల ఆశయాలను, హేతువాద, సామాజిక న్యాయ సూత్రాలను పాటిస్తూ కొత్త ప్రభుత్వం పనిచేయాలని ఆయన సూచించారు. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించి మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణకు హెచ్చరిక.. 47 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలో రెండు రోజులుగా కాస్త చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కనుంది. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని, ముఖ్యంగా ఈ నెల 18 నుంచి 22 మధ్య కాలంలో ఎండలు గరిష్ఠ స్థాయికి చేరతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రత ఏకంగా 47 డిగ్రీల మార్కును తాకే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు.మిగతా ప్రాంతాల్లో 46 డిగ్రీలకు చేరువగా, హైదరాబాద్ నగరంలో సైతం 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. రాబోయే రోజుల్లో పలు జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత పెరగనుందని, ఈ ప్రభావం కనీసం పది రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవచ్చని పేర్కొంది. ఆదివారం నిజామాబాద్ జిల్లా సాలూరలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.ఇదిలా ఉండగా, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వడగండ్ల వాన అన్నదాతలను తీవ్రంగా నష్టపరిచింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న రాశులు తడిసిముద్దయ్యాయి. తడిసిన పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

మొదటిపేజీ తరువాయి -

మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది.పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా

రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది. టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయ చైతన్యం నిండిన ఒక బలమైన జన సమూహాన్ని ప్రజా ఉద్యమాల కోసం నిర్మిద్దామని పిలుపునిచ్చింది.

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

మొదటిపేజీ తరువాయి - భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన



వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు.సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు.పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

# బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి - కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన తెలిపారు.ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని ఆయన తెలిపారు. బీజేపీ అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో బండి సంజయ్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలని అన్నారు.

**మోదీ పర్యటనకు అసాధారణ స్పందన**

సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగసభకు అసాధారణ స్పందన వచ్చిందని రామచందర్ రావు అన్నారు. మోదీ పర్యటనతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో స్పష్టమైన ప్రకంపనలు వచ్చాయని అన్నారు. ఈ సభ విజయవంతం కావడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని అన్నారు. వైద్యులు, నర్సులు, న్యాయవాదులు, యువత, మహిళలు, వివిధ రంగాల నిపుణులు, హైదరాబాద్ నలుమూలల నుంచి బీజేపీ



కార్యకర్తలతో కలిసి ఈ సభలో అపారమైన ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనసమూహం, అక్కడ వెల్లివిరిసిన ఉత్సాహం, మోదీ నాయకత్వంపై, అలాగే 'వికసిత తెలంగాణ – వికసిత భారతదేశం' అనే దార్శనికతపై ప్రజలలో పెరుగుతున్న అచంచలమైన విశ్వాసానికి సజీవ నిదర్శనంగా నిలిచిందని రామచందర్ రావు అన్నారు.

## తడిచిన మొక్కజొన్న వెంటనే కొనాలి

### రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంపై కోమరారంలో ఆందోళన



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** తడిచిన మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి, ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు వెంటనే నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఇల్లందు మండలం కోమరారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభమై 45 రోజులు దాటినా ప్రభుత్వం సరిపడా గోనె సంచులు ఇవ్వలేదని, రైతులే వేలాది బస్తాలు సొంతంగా కొనుగోలు చేశారని తెలిపారు. అకాల వర్షాలతో మొక్కజొన్న తడిచిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిచిన మొక్కజొన్నను కొనుగోలు చేసి, పెండింగ్ చెల్లింపులు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## 5-ఇంక్లైన్, మాయాబజార్ గ్రామస్తుల ఆందోళన హెచ్చరిక

### తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బాధిత కుటుంబాలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండల తహసీల్దార్ కె. నాగరాజు గారిని సోమవారం 5-ఇంక్లైన్, మాయాబజార్ గ్రామస్తులు కలిసి తమ సమస్యలను వివరించారు. గ్రామానికి చెందిన 51 కుటుంబాలకు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని, 57 కుటుంబాలకు ఇందిరమ్మ గృహ పథకం వర్తింపజేయాలని, అలాగే అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు మరియు ఇళ్ల పట్టాలు వెంటనే అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మూడు ప్రధాన అంశాలపై అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరిన గ్రామస్తులు, లేనిపక్షంలో తిరిగి 5-ఇంక్లైన్ మాయాబజార్ ప్రాంతంలో ఇళ్లను పునర్నిర్మించుకుని అక్కడే నివాసం ఏర్పరుచుకుంటామని హెచ్చరించారు. సంవత్సరాలుగా నివాస హక్కుల కోసం పోరాడుతున్న తమకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ గణేష్

### విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్ష
### యోగా, కరాటే, క్రీడల్లో శిక్షణ పొందాలని విద్యార్థులకు సూచన
### క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని వ్యాఖ్య
### చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్ష
### సుజాతనగర్ హైస్కూల్‌లో ఉత్సాహంగా ప్రారంభమైన సమ్మర్ క్యాంప్




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని కొత్తగూడెం మేయర్ గణేష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ మండలానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని యోగా, కరాటే, హస్తలేఖనం మరియు ఇతర క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. క్రీడలు పిల్లల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ మండల విద్యాశాఖ అధికారి లీలా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చింతలపూడి సుజాత, ప్రధానోపాధ్యాయులు రామమూర్తి, సింగభూపాలెం ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహారావు, సీపీఐ నాయకులు కొమరి వీరహనుమంతరావు, బొడ్డు కేశవరావు, యోగా శిక్షకురాలు విజయలక్ష్మి, కరాటే శిక్షకుడు ఇమామ్, విద్యార్థినీ విద్యార్థులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

## ఎక్లాస్ పూర్ ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం




**మంథని, మే 11(వార్త సంధ్య ) :** మంథని మండలం ఎగ్లాస్ పూర్ గ్రామంలోని పిఎంఎస్హెచ్ఆర్ఐ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామ పరిసర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి జ్యోతి తెలిపారు. అలాగే వాకింగ్ ట్రాక్ మార్గాన్ని మంథని ఎంఈఓ దాసరి లక్ష్మి ప్రారంభించారు. ఈ సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో ఆటలు, నృత్యాలు, పాటలు, సంగీతం నేర్పుటకు కళాకారిణి డ్యాన్స్ మాస్టర్ కుమారి పిల్లలకు డ్యాన్స్ లో శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామ ప్రజలు నడక చేయుటకు వాకింగ్ ట్రాక్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఎంఈఓ ఎన్ హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ బి రజిత, ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయులు వి జ్యోతి, ఎం అనిత, మంథని రాజశేఖర్, ములుకల్ల రాజశేఖర్, జె మంజుల, డాన్స్ మాస్టర్ ఆకాంక్ష, ఉప సర్పంచ్ అప్పల పర్వతాలు, వార్డు సభ్యులు పంచిక దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్నాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రజా పాలన ఉత్సవాలు




**మంథని, మే 11(వార్త సంధ్య) :** స్మైల్ ఫౌండేషన్ ఎన్జీవో వారి సౌజన్యంతో స్కూలుకు అందించబడిన డిజిటల్ ఎల్జి టీవీ విద్యార్థులకు ఎడ్యుకేషన్ అందించడానికి ఉపయోగ పడడానికి సోమవారం గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డిజిటల్ విద్యా ద్వారా విద్యార్థులకు సహకరించిన స్మైల్ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు.ప్రధానోపాధ్యాయులు నలుమాసు హరిప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ విద్యా ద్వారా ప్రపంచంలోనే నాలుగు మూలల ఇంతలో విశేషాలు పరంగా తరగతి గదిలోనే విద్యార్థిని విద్యార్థులకు ప్రపంచం మొత్తం చూపించడానికి డిజిటల్ విద్యా విధానం ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు వంగల కీర్తన మరియు పాఠశాల ఉపాధ్యాయులు రాధిక,సావిత్రి,శ్రీలత,వెంకటేశ్వర్లు,సంపత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంథని మధునయ్య,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అడుగులు ఎక్కడ...?




### పూర్వ వైభవం కోసం ఎదురుచూస్తున్న కొత్తగూడెం
### సింగరేణి వెలుగుల్లో మెరిసిన పారిశ్రామిక పట్టణం నేడు సమస్యల చీకట్లోనేనా..?
### జిల్లా కేంద్ర హోదా వచ్చినా ఆశించిన అభివృద్ధి ఎందుకు కనిపించలేదు..?
### మూతపడిన పరిశ్రమలు.. తగ్గిన ఉద్యోగాలు.. పెరిగిన వలసలు.. ఆందోళనలో ప్రజలు
### ప్రత్యేక ప్రణాళికలు, కొత్త పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధే పట్టణ భవిష్యత్తుకు కీలకం

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణం ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రతీకగా నిలిచింది. సింగరేణి బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, రవాణా మరియు వ్యాపార రంగాల విస్తరణతో ఈ ప్రాంతం రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. వేలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రబిందువుగా ఎదిగిన కొత్తగూడెం ప్రస్తుతం తన పూర్వ వైభవాన్ని తిరిగి అందుకోవాలనే ఆశతో



ఎదురుచూస్తోంది. 1980 నుంచి 1990 దశకాల మధ్య కొత్తగూడెం ప్రాంతం పరిశ్రమల హబ్‌గా పేరొందింది. బొగ్గు గనుల చుట్టూ అభివృద్ధి చెందిన కాలనీలు, కార్మికుల సందడి, వ్యాపార విస్తరణ, విద్యాసంస్థల పెరుగుదలతో పట్టణం ఎప్పుడూ కళకళలాడేది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఉపాధి కోసం ప్రజలు కొత్తగూడెంకు తరలివచ్చేవారు. ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటంతో యువతకు ఇది ఆశాకిరణంగా నిలిచింది. అయితే కాలక్రమేణా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అనేక చిన్నతరహా పరిశ్రమలు మూతపడటం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల తగ్గింపు, కొత్త పెట్టుబడులు లేకపోవడం, ప్రైవేట్ రంగ అభివృద్ధి మందగించడం వంటి కారణాలతో పట్టణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. ఒకప్పుడు రద్దీగా కనిపించిన వ్యాపార కేంద్రాలు నేడు నిశ్శబ్దంగా మారుతున్నాయనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. 2016లో కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా కొత్తగూడెంకు హోదా లభించింది. జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పరిపాలనా కార్యకలాపాలు పెరిగినా, పట్టణ రూపురేఖలు మారుతాయని ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లు దెబ్బతినడం, డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ ఇబ్బందులు, తాగునీటి సమస్యలు, పారిశుధ్య లోపాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



ప్రత్యేకించి యువతలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. ఉన్నత విద్య పూర్తిచేసిన యువకులు ఉద్యోగాల కోసం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానికంగా పరిశ్రమలు లేకపోవడం, ఐటీ లేదా సేవారంగ సంస్థలు రాకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు పరిమితమయ్యాయని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పారిశ్రామిక అభివృద్ధికి అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ ప్రభుత్వం సరైన దృష్టి సారించడం లేదని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. సింగరేణి ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్నతరహా తయారీ పరిశ్రమలు, ఐటీ సేవా కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా ఆధునిక రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, మల్టీలెవల్ పార్కింగ్, మెరుగైన వైద్య సేవలు, విద్యా సంస్థలు, షాపింగ్ మరియు వాణిజ్య సముదాయాల అభివృద్ధి అత్యవసరమని స్థానికులు కోరుతున్నారు. ఒకప్పుడు "పారిశ్రామిక పట్టణం"గా తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు పొందిన కొత్తగూడెం మళ్లీ అదే స్థాయిలో అభివృద్ధి సాధిస్తుందా..? జిల్లా కేంద్రంగా తన ప్రాధాన్యతను నిలబెట్టుకుంటుందా..? ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వస్తుందా..? అన్న ప్రశ్నలు ప్రస్తుతం ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
### ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 11( వార్త సంధ్య) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం గట్టుపల్లి గ్రామానికి చెందిన బి. హన్సిక తనకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా తహసిల్దార్ కార్యాలయంలో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని, స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకునేందుకు కుల ధృవీకరణ పత్రం అత్యవసరం అయినందున తనకు వెంటనే కుల ధృవీకరణ పత్రం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామపంచాయతీకి చెందిన ఆవుల వసంత తనకు ఇంటి నిర్మాణం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న అనుమతి మంజూరు చేయడం లేదని ఇంటిని నిర్మించు కునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రామగుండం నగరపాలక సంస్థకు చెందిన లింగం వెంకట్ రెడ్డి అయోధ్య నగర్ పరిధిలో ఇంటి యజమాని రేకుల ఇండ్లు నిర్మించుకుని దానికి తగిన పన్ను మాత్రమే చెల్లిస్తున్నారని, 6 సంవత్సరాల క్రితం ఆ రేకులను తొలగించి స్లాబ్ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ పాత రేకుల ఇంటి పన్ను మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నందున దానిని పరిశీలించి కొత్త ఇంటికి పన్ను పెనాల్టీతో సహ వసూలు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

### - మే నెలాఖరు వరకు 3.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ ఉంచుకోవాలి
### - రామగుండం ఎరువుల కర్మాగారం నుండి రాష్ట్రానికి కనీసం 90 శాతం సరఫరా చేయాలి
### - రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
### - ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాము
### - సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి.
### - రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
### - మే 21 నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాలలో రెండు జిల్లాల చొప్పున ప్రయోగాత్మకంగా అమలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 11:** రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశమున్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్ మరియు రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్ మరియు రిటైల్ లో ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర యూరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్ ను తీసుకువస్తుందని మంత్రి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్ ను అమలు చేయనున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నానో యూరియా తయారీ సంస్థలు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. నానో యూరియా వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి "రైతు నేస్తం" కార్యక్రమంలో ప్రసారం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని, సాధారణ యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు వివరించాలని ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని, ఆ ఫలితాల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగిస్తే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ & ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మీ, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైన నర్సులకు (12.05.2026) ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేయనున్నారు.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 11 :** కోటిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందుకోబోతున్న నర్సులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ఆరోగ్యశాఖలో 1919, లేబర్ డిపార్ట్‌మెంట్‌లో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేసింది. ఇందులో ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మందికి రేపు (మంగళవారం) అపాయింట్‌మెంట్లు అందజేయనున్నారు.

## గుంజపడుగులో పీ హెచ్ సి గద్దలపల్లి ఆధ్వర్యంలో నిక్షయ్ శివిర్ ప్రోగ్రాం



**మంథని, మే 11(వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో పి హెచ్ సి గద్దలపల్లి వారి ఆధ్వర్యంలో సోమవారం" నిక్షయ్ శివిర్ ప్రోగ్రామ్" నిర్వహించి చెస్ట్ ఎక్స్ రే తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ పాల్గొని మాట్లాడారు.. గ్రామంలో ఎవరు టిబి తో బాధపడకూడదని గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ ఎల్క లక్ష్మీ సదానందం, వార్డ్ సభ్యులు దేవరకొండ కోసం, మెడికల్ ఆఫీసర్ డా "సీహెచ్ మాధురి ,ఎంఎలపి హెచ్ ఆర్ వైష్ణవి, ఏఎన్ఎం లు యూ .పద్మ, బీ . లీల, హ హెచ్ఏ ఎం స్వామి, ఆశ వర్కర్స్ రమాదేవి, స్వప్న, శైలజ, ఆర్ .రమేష్ ఎక్స్రే టెక్నీషియన్ పాల్గొన్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# పాల్వంచలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**7వ, 42వ డివిజన్లలో విస్తృత తనిఖీలు**

**డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ తనిఖీలు**

**ప్రజల్లో భద్రతా భావం పెంపే లక్ష్యంగా పోలీసుల చర్యలు**

**కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు తపస్వి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** పాల్వంచ పట్టణంలో సోమవారం నాడు పోలీసులు నిర్వహించిన కార్డెన్ సెర్చ్ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సాగింది. పట్టణంలోని 7వ డివిజన్ మరియు 42వ డివిజన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై నిఘా భాగంగా విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు, నివాస ధృవపత్రాలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని అధికారులు సూచించారు. కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ సింధు తపస్వి పాల్గొని పోలీసుల చర్యలను అభినందించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి తనిఖీలు అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ఎస్సై జీవన్, ములకలపల్లి ఎస్సై మధు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడేందుకు ఇలాంటి తనిఖీలు తరచూ కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# పీఎం మోడీ తెలంగాణ టూర్... సీఎం రేవంత్ కీలక ప్రతిపాదన






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 11 :** ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు సంబంధించిన ప్రాజెక్టులకు త్వరితగతిన క్లియరెన్స్ కోసం ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ దేశంలోని ఆరు ప్రధాన మహానగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత కల్గిన కీలక ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడానికి ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలక ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో ప్రధాని సమక్షంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సభలో సీఎం ఈ కీలక ప్రతిపాదన చేశారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు సంబంధించిన ప్రాజెక్టులకు త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలంటే ప్రత్యేక వ్యవస్థ అవసరమని తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధిలో ఈ ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలంటే మెగా నగరాల అభివృద్ధి అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు.

# అంగన్‌వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేసిన

**- పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 11 (వార్త సంధ్య) :** రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఉప్పరల కేసారం -2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు మరియు చిన్నపిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం (టీఏచ్‌ఆర్ - టేక్ హోమ్ రేషన్ ) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ చిందం మహేష్ లబ్ధిదారులకు బాలామృతం, బియ్యం, కందిపప్పు, వంట నూనె, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు, చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్:రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ హామీ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య మే 11) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్సవాల్లో భాగంగా నిమ్స్ లో ప్రెస్ క్లబ్ సభ్యులు అందరికి మాస్టర్ హెల్త్ చెకప్ చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరి సోమవారం నాడు సచివాలయంలో మంత్రి దామోదర్ రాజ నరసింహ కు ఒక వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా త్వరలోనే నిమ్స్ లో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించడానికి అధికారులను ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఈ స్పెషల్ డ్రైవ్ లో మాస్టర్ హెల్త్ చెకప్ ఉచితంగానే చేస్తామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం రెగ్యులర్గా హెల్త్ చెకప్ చేసుకోవాలని మంత్రి సూచించారు. నిమ్స్ లో అవసరమైన ఏర్పాటు చేయాలని దామోదర్ రాజనర్సింహ రాష్ట్రఆరోగ్య విభాగం కార్యదర్శి క్రిస్టినాను ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ క్యాంపు క్యాంపు ఏర్పాటుకు అంగీకరించడం పట్ల ప్రెస్ క్లబ్ పాలకమండలి మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**-రాబోయే 15 రోజుల్లో 90% మ్యాపింగ్ పూర్తి చేయాలి**

**-ఏ నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి**

**-ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి**

**-వీవీఐపీ ,వీఐపీ, ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 11( వార్త సంధ్య) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు మిస్ అయ్యాయనే సంచలన వార్తలు రాకుండా చూడాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎన్నికల విభాగం అధికారి విజయ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళిత యువకుడి హత్య కేసు ఛేదన

**-ముగ్గురు నిందితుల అరెస్ట్ టాటా జెస్ట్ కారు,మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**గోదావరిఖని-××  టౌన్ పోలీసుల చాకచక్యంతో కేసు వేగంగా పరిష్కారం**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, గోదావరిఖని, మే 11 (వార్త సంధ్య) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని-×× టౌన్ పోలీసులు దళిత యువకుడు జూల వంశీ హత్య కేసును వేగంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని-×× టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు తో కలిసి నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఈ కేసును గోదావరిఖని ఏసీపీ పర్యవేక్షణలో గోదావరిఖని-×× టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారు సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల శంకరమ్మ తన కుమారుడు జూల వంశీ (ఎస్‌సీ మాదిగ) 29-04-2026 తేదీన ఇంటి నుండి వెళ్లి కనిపించకుండా పోయాడని 01-05-2026న గోదావరిఖని-×× టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీడీఆర్, మొబైల్ కాల్ వివరాలను పరిశీలించగా ఏ1 అలేఖ్య, ఏ2 నీలం నవీన్, ఏ3 బుర్ర భాస్కర్ లపై అనుమానం వ్యక్తమైంది.వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ముగ్గురు కలిసి వంశీని హత్య చేసినట్లు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు.

**వివరాల్లోకి వెళితే...**

మృతుడు జూల వంశీ మరియు ఏ1 అలేఖ్య పదో తరగతి సమయంలో ప్రేమించుకున్నారు. అనంతరం అలేఖ్య, ఏ2 నీలం నవీన్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. అయితే 2025 ఫిబ్రవరిలో జరిగిన పదో తరగతి గెట్ టు గెదర్ కార్యక్రమం అనంతరం వంశీ,అలేఖ్య మొబైల్ నంబర్ తీసుకుని ప్రేమ పేరుతో తరచూ ఫోన్ కాల్స్,మెసేజ్‌లు చేస్తూ వేధింపులకు గురి చేశాడు. అంతేకాకుండా వంశీ మూడు సార్లు అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లి గొడవలకు దిగగా,ఏ2 నీలం నవీన్ మరియు ఏ3 బుర్ర భాస్కర్ అక్కడికి చేరుకుని అతడిని మందలించి పంపించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ విషయాలను అలేఖ్య తన భర్త నవీన్ మరియు భాస్కర్ కు తెలియజేయడంతో ముగ్గురు కలిసి వంశీని హత్య చేయాలని కుట్ర పన్నారు.పథకం ప్రకారం అలేఖ్య, భాస్కర్ ఫోన్ చేసి వంశీని హైదరాబాద్‌కు రప్పించారు. 30-04-2026 తేదీన వంశీ ముందుగా అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లగా,అక్కడి నుండి ముగ్గురు కలిసి భాస్కర్ కు చెందిన టాటా జెస్ట్ కారులో అతని ఫ్లాట్‌కు వెళ్లారు. అదే సమయంలో నీలం నవీన్‌పై అనుమానం రాకుండా ఉండేందుకు తాను డ్యూటీకి వెళ్తున్నానని చెప్పినట్లు విచారణలో వెల్లడైంది. తర్వాత భాస్కర్ తన ఫ్లాట్‌లో వంశీకి మద్యం తాగించి గొడవకు దిగాడు.

అనంతరం ముందుగానే సిద్ధం చేసుకున్న కత్తితో వంశీ ఛాతి,మెడ భాగాల్లో విచక్షణారహితంగా పొడవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం అలేఖ్య ఫోన్ ద్వారా నీలం నవీన్‌కు సమాచారం ఇవ్వగా, నవీన్ అక్కడికి చేరుకుని భాస్కర్‌తో కలిసి గదిలోని రక్తపు ఆనవాళ్లను లైజాల్‌తో శుభ్రం చేసినట్లు వెల్లడైంది.అనంతరం భాస్కర్, నవీన్ కలిసి మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లు మరియు మ్యాట్‌లో చుట్టి కారులో ఉంచారు. తరువాత భాస్కర్ ఒక్కడే టాటా జెస్ట్ కారు నంబర్ టీఎస్ -07-యూహెచ్ -6753 లో మృతదేహాన్ని మంథని మండలం గాడుదులగండి ప్రాంతానికి తీసుకెళ్లి రోడ్డు పక్కనున్న లోయలో పడవేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుండి ఒక టాటా జెస్ట్ కారు మరియు ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# రైతు రిజిస్ట్రీ నమోదు 100 శాతం పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-వచ్చే ఖరీఫ్‌కు క్రాప్ బుకింగ్ లక్ష్యాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి**

**-ప్రతి అర్హత రైతుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా ప్రయోజనాలు అందాలి**

**-రైతు బీమా పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి**

**-ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి పెండెన్సీ లేకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలి**

**-వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**






**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 11( వార్త సంధ్య) :** రైతు రిజిస్ట్రీ నమోదు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రతి రైతు రైతు రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ భవిష్యత్తులో యూరియా, సబ్సిడీ విత్తనాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు అనుసంధానం కానున్నందున ఒక్క రైతు కూడా నమోదు కాకుండా మిగలకుండా చూడాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో రైతు రిజిస్ట్రీ నమోదు 80 శాతం మాత్రమే పూర్తైందని, ముఖ్యంగా శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో 70 శాతానికి పరిమితమైందని తెలిపారు. ప్రతి ఏఈఓ ప్రతి రోజూ కనీసం 10 మంది రైతుల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్రాప్ బుకింగ్ 100 శాతం పూర్తి అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి అర్హులైన ప్రతి రైతుకు ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో పెండింగ్‌లో ఉన్న రైతు బీమా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు కుటుంబాలందరికీ పథకం ప్రయోజనం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతు బీమా ప్రతిపాదనలు ఆలస్యం లేకుండా వెంటనే పంపించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏఈఓల హాజరు 100 శాతం ఉండేలా ఎఫ్ఎల్ఎన్ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల వేగాన్ని వెంటనే పెంచాలని, ధాన్యం నాణ్యతను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్ఏక్యూ నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. చివరి బస్తా ధాన్యం కొనుగోలు అయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎంఏఓలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలి

**విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం**

**విద్యా ప్రమాణాల పెంపుకు అంకితభావంతో పని చేయాలి**

**పేద విద్యార్థులకు ఉన్నత విద్య చేరువ కావాలి**

**కళాశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: ఎమ్మెల్యే కూనంనేని**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గంలోనే ఆదర్శవంతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలు పేద మరియు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రధాన వేదికలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందించడంలో ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు. కళాశాలలో అకడమిక్ ప్రణాళికలు, విద్యార్థుల హాజరు శాతం, ల్యాబ్‌లు, లైబ్రరీ వసతులు, విద్యా ప్రమాణాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధ్యాపకులు కేవలం పాఠాలు బోధించడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశకులుగా వ్యవహరించాలని సూచించారు. బాధ్యతాయుతమైన బోధనతో కళాశాల ప్రతిష్టను మరింత పెంచాలని కోరారు. కళాశాల భవనాల మరమ్మతులు, అదనపు తరగతి గదులు, సిబ్బంది కొరత, విద్యా పరికరాల అవసరాలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.

# ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

**పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి**

**కార్పొరేట్ శక్తుల కోసమే సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారు**

**ధరలు తగ్గించకుంటే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తాం**

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే ఫహీమ్**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర ధరలను అరికట్టడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే ఫహీమ్ విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ సోమవారం కొత్తగూడెం పట్టణంలోని రామాటాకీస్ రోడ్డులో సంఘం ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కేవలం కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చడమే ధ్యేయంగా పనిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి సామాన్యుడి నడ్డి విరిచారని ఆరోపించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు భారంగా మారాయని పేర్కొన్నారు. తక్షణమే ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే ఖయ్యూమ్, పట్టణ నాయకులు మజ్జిగ రణధీర్, జావీద్, కోచెర్ల రాకేష్, రసూల్, యాకుబ్, కొయ్యడ రవి, అజయ్, వినయ్, సంజయ్, విజయ్ కాంత్, చిన్ను, నాగరాజు, ఆశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు దళిత సంఘాల ఘన సత్కారం

**10వ తరగతి టాపర్లకు పట్టు శాలువాలతో అభినందనలు**

**ఉన్నత చదువులతో ఉన్నత స్థాయికి ఎదగాలి**

**ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతోంది**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పూల బొకేలు అందించి, పట్టు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు బెజ్జంకి సత్యనారాయణ, సముద్రాల గాయత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అత్యున్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదవ తరగతిలో కృతిక 565 మార్కులు, శ్రీనిజ 534 మార్కులు, భువనేశ్వరి 491 మార్కులు సాధించి ప్రతిభ చాటగా, పలువురు విద్యార్థులను అభినందించారు.

# అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం. వేముల లక్ష్మణ్ దండువుల మైసయ్య ఆధ్వర్యంలో ప్రెస్మీట్ పెట్టడం జరిగింది.

**జాతీయ అండ్ రాష్ట్ర వర్గం ప్రెస్ మీట్ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెస్ మీట్ పెట్టడం జరిగినది.**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 11 :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ ప్రెసిడెంట్ అయిన రామచంద్రరావుని కలవడం జరిగినది. ప్రెసిడెంట్ కి మెమొరండం ఇవ్వడం జరిగినది. మాకు శ్రీమాన్ నరేంద్ర మోడీ గారితో మా యొక్క కుల సమస్యలకు విన్నవించుకోవడం కోసం మెమోరండం ఇవ్వడం జరిగినది. అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ గారు అధ్యక్షతన లో జరిగినది. అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం లో మార్పులు చేర్పులు చేయడం జరిగినది. నేషనల్ జనరల్ సెక్రెటరీ గుంజ శ్రీనివాస్ ని తీసేయడం జరిగినది. నేషనల్ జనరల్ సెక్రెటరీగా వరికుప్పల శ్రీనివాస్ ని నిర్ణయించడం జరిగినదిఅదేవిధంగా మంజుల రమేష్ ని తీసేయడం జరిగినది. రాష్ట్ర అధ్యక్షుడు దండగుల మైసయ్యని నియమించడం జరిగినది. విచ్చేసిన అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నుండి కుంచపు రామ గారిని తీసేయడం జరిగింది .అదే విధంగా శ్రీమతి బోదాసు మాధవి ని తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిని నియమించడం జరిగినది. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘంలో గతంలో ఉన్న ప్రతి ఒక్క పోస్టు డిసాల్ట్ చేయడం జరిగినది అయినా కూడా మళ్లీమళ్లీ పదవులు పెట్టుకొని ముందుకు కొనసాగుతున్నారు. బీసీ చైర్మన్ నిరంజన్ ని కలవడం జరిగినది. వడ్డెర కులాన్ని డిఎన్టిలో చేర్చడం జరిగినది.. డి ఎన్ టి. ఇంటిలో 51 కులం చేర్చడం జరిగింది. తను సానుకూలంగా స్పందించడం జరిగినది . వేముల లక్ష్మణ్ . దండగుల మైసయ్య . వేముల తిరుమల దేవి . వరికుప్పల శ్రీను . మొక్కల శేఖర్. యూత్ ప్రెసిడెంట్ వేముల లోకేష్

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఏఐసీసీ కార్యదర్శి కమలాక్షి రాజన్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కట్టుబడి ఉంటుందని, పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపుతో పాటు పదవులు లభిస్తాయని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ కమలాక్షి రాజన్ పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కార్యకర్తల భారీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పెన్షన్ల పంపిణీ. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల అమలుకు పార్టీ కట్టుబాటు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై కేసు నమోదైన నేపథ్యంలో, బండి సంజయ్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని బండి రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణలత, మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంచార్జ్ సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ పుష్పారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బక్రీద్ సందర్భంగా అక్రమ జంతు రవాణా పై ఉక్కుపాదం




**చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలే .**

**భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 11 (వార్త సంధ్య) :** రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. అక్రమంగా జంతువులను తరలించడం, చట్ట విరుద్ధంగా వధించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల నిఘా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి జరిగే అక్రమ జంతు రవాణాను అరికట్టేందుకు 2 అంతర్రాష్ట్ర, 3 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీసులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆవులు, దూడలను అక్రమంగా రవాణా చేసి వధించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. అక్రమ రవాణాను అడ్డుకునే పేరుతో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, వ్యక్తిగత దాడులు లేదా గుంపుల దాడులు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తెలిపారు. ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా కొనసాగిస్తోందన్నారు. ప్రజలు పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు విద్యాభివృద్ధికి దోహదం చేస్తాయి

**- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐఎఫ్ఎస్సి, ఐడిపిఎస్ డిజిటల్ బోర్డుల ఆవిష్కరణ**




**మంథని, మే 11(వార్త సంధ్య ) :** విద్య వ్యవస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాబోయే కాలంలో మంచి ఫలితాలను ఇస్తాయని మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఆదేశానుసారశీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు మంథని పెద్దపెల్లి జిల్లాలో మొదటి రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వారు విద్యార్థులకు వివరించారు. కళాశాల అభివృద్ధికి తాము సంపూర్ణ సహకారం అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్, అధ్యాపక అధ్యాపకేతర బృందం, కౌన్సిలర్ రాజు గౌడ్,విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నగల దుకాణం చోరీ కేసు పోలీసుల అదుపులో దోపిడీ గ్యాంగ్?

**కరీంనగర్ నగల దోపిడీ, కాల్పుల కేసు దర్యాప్తు ముమ్మరం**

**దొంగల ముఠాలో కొంతమందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ముఠా సభ్యుల సమాచారంతో ఓ వ్యాపారి వద్ద కొంత బంగారం స్వాధీనం**




కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే ఆభరణాల దుకాణం దోపిడీ కేసు దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. దొంగల గ్యాంగ్?లో కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మే 3వ తేదీన ఐదుగురు దొంగలు నగల షాపులో సిబ్బందిని బెదిరించి, కాల్పులు జరిపి 1.6 కిలోల బంగారు నగలు దోపిడీ చేసిన విషయం విధితమే. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు హైదరాబాద్, కరీంనగర్?లకు చెందిన బృందాల ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసులు కరీంనగర్‌లోని వందల సీసీటీవీ కెమెరాలను నిశితంగా పరిశీలించి, ఒక్కో ఆధారాన్ని సేకరించడం ద్వారా దోపిడీ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. చోరీ జరిగిన మరుసటి రోజే గ్యాంగ్ సభ్యుల ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. కరీంనగర్ నుంచి ముఠా పారిపోయిన రూట్‌తో పాటు ధర్మపురి, పెద్దపల్లి పట్టణాల్లో వారు బస చేసిన లాడ్జిలను గుర్తించారు. సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా బిహార్, మహారాష్ట్రలకు వెళ్లారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్, బంధువులపై నిఘా ఉంచి గ్యాంగ్ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. దోపిడీ చేసిన బంగారు ఆభరణాల విక్రయంపై ముఠా నాయకుడు ఇచ్చిన సమాచారంతో కరీంనగర్‌కు చెందిన స్పెషల్ పోలీస్ టీం బెంగాల్‌లోని ఓ వ్యాపారి వద్ద కొంత మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నెల 3వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో కరీంనగర్‌లోని పీఎంజే జువెల్లరీ షాపులోకి వినియోగదారులుగా వచ్చిన ఐదుగురు దొంగలు లోపలికి వెళ్లి నగలు చూపించమని అడగగా, సిబ్బంది పసిడి ఆభరణాలు చూపించారు. అనంతరం దుండగులు బంగారం షాప్ సిబ్బందిని గన్‌తో బెదిరించారు. ఆ తర్వాత వారిని కట్టేసి కాల్పులు జరిపి, చూపించిన పసిడి నగలతో ఉడాయించారు. ఈ క్రమంలో కాల్పుల్లో ముగ్గురు జువెల్లరీ సిబ్బంది గాయపడగా, వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని సందర్శించిన సీపీ గౌస్ ఆలం పరిశీలించి విచారణ జరుపుతున్నారు. పీఎంజే దుకాణం సమీపంలోని డ్రైనేజీలో కత్తెర, తుపాకీ మ్యాగ్జిన్, ప్లాస్టర్ గుర్తించారు. ఘటనా స్థలిలో బుల్లెట్లను స్వాధీనం చేసుకుని సీసీ ఫుటేజీల ఆధారంగా దుండగుల కోసం గాలింపు ప్రారంభించారు. ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ధర్మపురికి మొదట నలుగురు దుండగులు వచ్చారు. లాడ్జిలో ఏసీ గదిని అద్దెకు తీసుకున్నారు. ఒకటి, రెండు తేదీలకు గానూ రూ.2400, మూడో తేదీన ఉదయం 6 గంటలకు ఖాళీ చేసి మరో రూ.600 చెల్లించినట్లుగా రసీదులను పోలీసులు గుర్తించారు. తొలుత వచ్చిన నలుగురితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కింద గదిని అద్దెకు తీసుకున్నట్లుగా లాడ్జి సిబ్బంది చెబుతున్నారు. దొంగల ముఠా సభ్యులు కరీంనగర్‌కు వచ్చి పసిడి నగలను దోచుకుని తిరిగి ధర్మపురికి చేరుకుని అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పారిపోయినట్లుగా తెలుస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉండేందుకు తప్పుడు ఆధార్ సంఖ్య, సమాచారాన్ని రసీదులో ఎంటర్ చేసినట్లు తేలింది. ధర్మపురిలోని మహాలక్ష్మి పుష్కర్ ఘాట్ సమీపంలో దొంగలు వాడిన పల్సర్ బైక్, శిరస్త్రాణాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే పోలీసు జాగిలాలను తెప్పించి గాలింపు చేపట్టినప్పటికీ ఎటువైపు వెళ్లారనే ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. ముఠా సభ్యులు బైక్‌కు వాడిన నెంబర్ ప్లేట్ సైతం ఓ కారుదని తేలింది. మరో అపాచీ బైక్ మంచిర్యాల జిల్లా కలమడుగు గ్రామ సమీపంలో లభ్యమైనట్లుగా సమాచారం. మే 3వ తేదీన ఉదయం ఆరున్నరకు ధర్మపురి నుంచి వెళ్లినట్లుగా సీసీటీవీ కెమెరాల్లో నమోదైంది. దోపిడీ తర్వాత మధ్యాహ్నం ఒంటిగంటకు ధర్మపురి మండలం నక్కలపెంట మీదుగా వెళ్తున్నట్లుగా పలు దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

# ప్రతి జిల్లాకు ఒక నైపుణ్య ప్రణాళిక

**మూడేళ్లలో 7.50 లక్షల మందికి శిక్షణ, ఉపాధి కల్పనే లక్ష్యం**

**నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖకు ప్రత్యేకంగా ఒక కమిషనరేట్ ఏర్పాటు**

**స్థానిక ప్రాధాన్య రంగాల్లో ఉద్యోగాల కల్పన**

**నివేదిక రూపొందించిన నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ**



రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మొట్టమొదటిసారిగా ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. 'ఒక జిల్లా- ఒక నైపుణ్య విజన్' అనే పేరుతో రాష్ట్రంలో దీన్ని అమలు చేయనుంది. జిల్లాల్లో స్థానికంగా ఉపాధి కల్పించే రంగాలు ఏవి, రాబోయే మూడు సంవత్సరాలలో యువతకు వీటిలో ఎన్నిరకాల ఉద్యోగాలు లభిస్తాయి, తదనుగుణంగా యువతకు ఎలాంటి నైపుణ్య శిక్షణను అందించాలి వంటి అంశాలతో ప్రత్యేక నివేదికను సిద్ధం చేసింది. ప్రధాన, అనుబంధ రంగాల్లో కలిపి మూడేళ్లలో దాదాపు 7,50,607 మందికి నైపుణ్య శిక్షణను ఇచ్చి, ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. మొదటి సంవత్సరం సుమారు 1,49,741, రెండో ఏడాది 2,46,689, మూడో ఏడాది 3,54,177 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కొన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించనున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఫార్మా కంపెనీలు ఎక్కువగా ఉన్నందున అక్కడ ఫార్మా, లైఫ్‌సైన్స్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వ్యవసాయం, ఆక్వా దాని అనుబంధ రంగాలు, పర్యాటక, ఆహార, ఆతిథ్య, శుద్ధి, లాజిస్టిక్స్, పునరుత్పాదక ఇంధన తదితర రంగాల్లో ఉపాధికి ఎక్కువ అవకాశముంది. రాయలసీమలో తయారీ, పునరుత్పాదక, నిర్మాణం, ఎలక్ట్రికల్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. రాష్ట్రంలో అన్నిచోట్లా అన్నిరకాల నైపుణ్యాలపై శిక్షణ ఇస్తే స్థానిక అవసరాల మేరకు యువతకు ఉద్యోగాలు లభించడం లేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా నైపుణ్య ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖకు ప్రత్యేకంగా ఒక కమిషనరేట్‌ను ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఉపాధి కల్పన, నైపుణ్య అధికారులను నియమించింది. వీరికి అనుబంధంగా ప్రజలకు అనుసంధానంగా ఉండే గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ నైపుణ్య సిబ్బంది ఉన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో శిక్షణ పక్కాగా అమలు చేసే అవకాశం ఏర్పడింది. వ్యవసాయం అనేది రాష్ట్రంలో ప్రధాన ఉపాధి వనరు కావడంతో చాలా జిల్లాల్లో ఈ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. ఉద్యాన, అనుబంధ రంగాల్లో లభించే ఉపాధి అవకాశాలను గుర్తించారు. మొదట స్థానిక నైపుణ్యాల గుర్తించడం. ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక వనరులు, పరిశ్రమలతో పాటు స్థానికంగా ఉపాధి కల్పించే రంగాలను గుర్తించడం. అంతేకాకుండా రాబోయే మూడు సంవత్సరాలలో ఆయా రంగాలలో ఎన్ని ఉద్యోగాలు లభిస్తాయో అంచనా వేయడం. దానితో పాటు నైపుణ్య శిక్షణను అందించడం. ఆ ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించడం. జిల్లా కమిటీలను బలోపేతం చేయడం కూడా దీని ముఖ్య ఉద్దేశమే. జిల్లా నైపుణ్య కమిటీల ద్వారా నైపుణ్య వ్యవస్థను బలోపేతం చేసి, స్థానికంగా ఉపాధితో పాటు ఆదాయ వృద్ధిని పెంచడం.

# పార్సిల్ వచ్చింది, చిరునామా అప్‌డేట్ చేయండి

**నమ్మి వివరాలు నమోదు చేస్తే అంతే!**

**కొరియర్ కంపెనీలు, పోస్టల్ శాఖ పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు**

**ఫోన్లకు మెసేజ్‌ల ద్వారా పిషింగ్ లింక్‌లను పంపుతున్న వైనం**

**నమ్మి వివరాలు నమోదు చేశారో ఖాతా ఖాళీయే**




"హలో సార్ నేను కొరియర్ సంస్థ నుంచి కాల్ చేస్తున్నాను. మీ పేరుపైన ఒక బుక్ పార్సిల్ వచ్చింది. కానీ మీ చిరునామా సరిగా లేక డెలివరీ చేయలేకపోతున్నాం. మీ నంబరుకు ఒక ాామీా పంపించాం. అందులో పూర్తి వివరాలు నమోదు చేయండి" అని నమ్మించి డబ్బులు దోచేస్తున్న ఘటనలు ఇటీవల రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోస్టల్ శాఖ, కొరియర్ కంపెనీలు పేర్లతో నేరగాళ్లు ఇలాంటి మోసాలకు నిత్యం పాల్పడుతున్నారు. అయితే వీటిపై చాలామందికి అవగాహన లేదు. దీంతో మోసగాళ్ల పని మరింత తేలికవుతోంది. సైబర్ మోసగాళ్లు మన ఫోన్లకు మెసేజ్‌ల ద్వారా పలు పిషింగ్ లింక్‌లను పంపుతారు. అవి కొరియర్ కంపెనీలు, పోస్టల్ శాఖ పేర్లతో వస్తాయి. ఈ లింక్‌లో మీ వివరాలు నమోదు చేయకపోతే పార్సిల్ డెలివరీ కాదు, వెనక్కు వెళ్లిపోతుందని కాల్ చేసి మరీ తెగ హడావుడి చేస్తారు. ఈ క్రమంలో వివరాలను ధ్రువీకరించుకునేందుకు నామమాత్రంగా కొంత మొత్తం నగదు చెల్లించాలని ముందుగా అడుగుతారు. అయితే కార్డు ద్వారా మాత్రమే డబ్బులు చెల్లించాలని కోరుతారు. చాలా మంది దీన్ని నిజమని నమ్మి సంబంధిత లింక్‌లో కార్డు నంబరు, సీవీవీ, గడువు తేదీ వంటి వివరాలను నమోదు చేస్తుంటారు. దీంతో బాధితుల ఖాతాలను మోసగాళ్లు వెంటనే వారి నియంత్రణలోకి తీసుకుంటు న్నారు. అనంతరం విడతల వారీగా డబ్బును ఖాళీ చేస్తారు. ఇటీవల విజయవాడ నగరానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు ఓ కొరియర్ కంపెనీ పేరుతో మెసేజ్ వచ్చింది. 'మీకు బెంగళూరు నుంచి ఒక పార్సిల్ వచ్చింది. కానీ అడ్రస్ సరిగా లేక డెలివరీ చేయలేకపోతున్నాం. దయచేసి చిరునామాను వెంటనే అప్‌డేట్ చేసుకోండి. అందుకోసం ఈ లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయండి' అని అందులో ఉంది. ఇది నిజమే అని నమ్మిన ఆ వ్యక్తి ఎస్ఎంఎస్‌లోని లింక్ తెరిచి తొలుత అడ్రస్ నమోదు ఎంటర్ చేశాడు. అనంతరం కార్డు ద్వారా రూ.25 చెల్లించాలని అందులో ఉంది. దీంతో డెబిట్ కార్డు వివరాలు నమోదు చేసి చెల్లించాడు. కొద్దిసేపటికే విడతల వారీగా మొత్తం రూ.3.10 లక్షలు అకౌంట్ నుంచి డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వెంటవెంటనే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన బాధితుడు పరుగుపరుగునా బ్యాంకుకు వెళ్లి ఆరా తీశాడు. అధికారులు వివిధ ఖాతాలకు ఆ డబ్బు బదిలీ అయినట్లు చెప్పడంతో చివరికి మోసపోయినట్లు గ్రహించాడు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఎస్ఎంఎస్‌లకు, కాల్స్‌కు స్పందించకపోవడం మంచిది. ఫోన్ చేసిన వ్యక్తి నుంచి పార్సిల్‌కు సంబంధించిన వివరాల గురించి పూర్తిగా ఆరా తీయాలి. వాటిని సంబంధిత కొరియర్ అధికారిక వెబ్‌సైట్‌లో మరోసారి సరిచూసుకోవాలి. అంతేగాక కీలకమైన బ్యాంకు వివరాలను, ఆధార్ లింకులు ఓపెన్ చేసి నమోదు చేయకూడదు. కొరియర్ కంపెనీ, పోస్టల్ వాళ్లు పార్సిల్ పంపించేందుకు చిరునామాలను అప్‌డేట్ చేసుకోమని ఎలాంటి మెసేజ్‌లు పంపరని తెలుసుకోవాలి. ఇలాంటి ఎస్ఎంఎస్‌లు వస్తే మాత్రం సంబంధిత కొరియర్ సంస్థ కస్టమర్ కేర్ నంబరుకు ఫోన్ చేసి మరోసారి పూర్తిగా ధ్రువీకరించుకోవాలి.


# కారు - స్పోర్ట్స్ బైక్ ఢీ - ఐదుగురి మృతి

**మరో మహిళ పరిస్థితి విషమం**

**మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డులో స్పోర్ట్స్ బైక్, కారు ఢీకొని ప్రమాదం**

**బైక్‌పై ఉన్న ఇద్దరు, కారులో ఉన్న ముగ్గురు మృతి**

**కారులో ఉన్న ఇద్దరు చిన్నారులు, మహిళ మృతి**



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నగరంలోని బైపాస్ రహదారిలో పాలకొండ జంక్షన్ వద్ద స్పోర్ట్స్ బైక్ అతివేగంగా కారును ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందారు. మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలను చేపట్టారు. వివరాల్లోకి వెళితే,మహబూబ్‌నగర్‌లోని న్యూ ప్రేమ్ నగర్‌కు చెందిన రెండు కుటుంబాలకు చెందిన వారు కారులో వెళ్తూ పాలకొండ చౌరస్తాలో యూటర్న్ తీసుకునే క్రమంలో అటువైపుగా వేగంగా దూసుకొచ్చిన స్పోర్ట్స్ బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలోనే బైక్‌పై ఉన్న ఇద్దరు, కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన అర్షియ బేగం (30), ఉజేప (7), అమర్(2) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, బైక్‌పై ఉన్న హైదరాబాద్‌కు చెందిన యాకుబ్ అఫ్జల్(25)తో పాటు మరో వ్యక్తి కూడా మృతి చెందారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. రేష్మా బేగంకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దాదాపు 140 కిలోమీటర్ల వేగంతో వచ్చిన బైక్ అదుపు తప్పి కారును ఢీకొట్టినట్లు తెలుస్తోంది. అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తానికి యువకుల నిర్లక్ష్యపు బైక్ రేసింగ్ సరదా ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి. అధిక శాతం ఘటనల్లో మితిమిరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నిర్లక్ష్యంగా నడపటం లాంటివి అధిక శాతం దుర్ఘటనలకు కారణం అవుతున్నాయి. కొందరు వాహనదారుల తప్పిదాల కారణంగా అభం శుభం తెలియని వారు దుర్మరణం చెందుతున్నారు. ఫలితంగా వారి కుటుంబాలకు తీవ్ర శోకాన్ని మిగిల్చుతున్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని ప్రజలకు పోలీసులు ఎంతగా అవగాహన కలిగిస్తున్నప్పటికీ, ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం కూడా అనేక ప్రమాదాలకు కారణం అవుతోంది.

# ఇస్రో మాజీ శాస్త్రవేత్తల సంచలనం


## దేశంలోనే తొలి స్పేస్-టెక్ యూనికార్న్‌గా స్కైరూట్ ఏరోస్పేస్!



హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సరికొత్త చరిత్ర సృష్టించింది. యూనికార్న్ హోదా దక్కించుకున్న దేశంలోనే తొలి స్పేస్-టెక్ స్టార్టప్‌గా ఈ సంస్థ నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ లో పనిచేసిన మాజీ శాస్త్రవేత్తలు 2018లో ఈ కంపెనీని స్థాపించారు. తాజాగా జరిగిన ఫండింగ్ రౌండ్‌లో ఈ స్టార్టప్ విలువ 1.1 బిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో మన స్థానిక ప్రతిభకు ఉన్న సత్తా ఏంటో ఈ మైలురాయి నిరూపించింది. పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా తమ నైపుణ్యంతో శక్తివంతమైన రాకెట్లను రూపొందించారు. వీరి విజయం తెలంగాణలోని డీప్‌టెక్ రంగానికి ఒక పెద్ద మలుపు అని చెప్పాలి. అడ్వాన్స్‌డ్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్‌కు హైదరాబాద్ ఇప్పుడు ఒక ప్రధాన కేంద్రంగా మారుతోందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ప్రభుత్వ రంగ అనుభవం ప్రైవేట్ రంగంలో అద్భుత విజయాలకు ఎలా దారితీస్తుందో ఈ ప్రయాణం చూపిస్తోంది. మన ఇంజనీర్లు ఇప్పుడు మునుపెన్నడూ లేనంతగా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నారు. భారతదేశపు తొలి స్పేస్-టెక్ యూనికార్న్‌గా స్కైరూట్.. దీని ప్రభావం ఏంటి? ప్రైవేట్ లిమిటెడ్ వంటి అంతర్జాతీయ దిగ్గజ ఇన్వెస్టర్లు ఈ ప్రతిష్టాత్మక ప్రయాణానికి అండగా నిలిచారు. విక్రమ్ సిరీస్ లాంచ్ వెహికల్స్ అభివృద్ధికి ఈ నిధులు ఎంతో కీలకం కానున్నాయి. తక్కువ ఖర్చుతో, వేగంగా చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడమే ఈ రాకెట్ల ప్రధాన లక్ష్యం. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ నుంచి వీరికి అవసరమైన నియంత్రణ మద్దతు లభిస్తోంది. ప్రైవేట్ మిషన్లు విజయవంతం కావడానికి ఇలాంటి సహకారం ఎంతో అవసరం. కంపెనీ తన కార్యకలాపాలను విస్తరిస్తుండటంతో హైదరాబాద్‌లో స్థానికంగా ఉద్యోగ నియామకాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ విభాగాల్లో కొత్త అవకాశాలు రానున్నాయి. ఈ వృద్ధి హైటెక్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో హైదరాబాద్ కీర్తిని మరింత పెంచుతుంది. ఈ చారిత్రాత్మక విలువకు సంబంధించిన కీలక ఆర్థిక వివరాలను కింద ఉన్న పట్టికలో చూడవచ్చు. ఈ ఫలితాలు భవిష్యత్తులో మరిన్ని విజయాలకు బాటలు వేస్తున్నాయి. వివరాలు వివరణ ప్రస్తుత విలువ 1.1 బిలియన్ డాలర్లు మొత్తం నిధులు 95 మిలియన్ డాలర్లకు పైగా ప్రధాన కార్యాలయం హైదరాబాద్, తెలంగాణ కీలక సాంకేతికత విక్రమ్ లాంచ్ వెహికల్స్ స్కైరూట్ ఏరోస్పేస్ – డీప్‌టెక్ వృద్ధికి కొత్త దిశ స్కైరూట్ సాధించిన విజయం ఇతర భారతీయ డీప్‌టెక్ సంస్థలకు ఒక గొప్ప సంకేతం. వేలాది మంది యువ ఇంజనీర్లు ఇప్పుడు స్పేస్-టెక్ రంగాన్ని ఒక అద్భుతమైన కెరీర్ ఆప్షన్‌గా చూస్తున్నారు. మన స్థానిక ప్రతిభ ప్రపంచ వేదికపై పోటీ పడగలదని ఈ విజయం నిరూపించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేలా తన విధానాలను కొనసాగిస్తోంది. ఇలాంటి వ్యవస్థకు మద్దతు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో మరిన్ని సక్సెస్ స్టోరీలు పుట్టుకొస్తాయి. భారతీయ ప్రైవేట్ అంతరిక్ష సంస్థలను అంతర్జాతీయ మార్కెట్ చూసే విధానాన్ని ఈ పరిణామం పూర్తిగా మార్చేసింది. ఈ ఎలైట్ క్లబ్‌లో చేరడం ద్వారా స్కైరూట్ మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. రాబోయే గొప్ప అంతరిక్ష పోటీకి హైదరాబాద్ ఇప్పుడు కేంద్ర బిందువుగా నిలిచింది. ఇస్రో ల్యాబ్‌ల నుంచి ప్రైవేట్ సైన్స్ రంగంలో ఇది ఒక కొత్త శకానికి ఆరంభం.

# భారత ఫారెక్స్ రిజర్వులను దెబ్బతీసిన ఇరాన్ యుద్ధం

## భారీగా తగ్గిన బంగారం నిల్వలు..



పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ కేంద్రంగా సాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేస్తోంది. ముడి చమురు, సహజ వాయువు దిగుమతులపై అత్యధికంగా ఆధారపడే భారతదేశంపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. చమురు ధరల పెరుగుదల దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని పెంచడమే కాకుండా.. భారత రూపాయి విలువపై, దేశ విదేశీ మారక నిల్వలపై ఊహించని ఒత్తిడిని తీసుకువచ్చింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కేవలం ఒక్క నెల వ్యవధిలోనే భారతదేశ విదేశీ మారక నిల్వలు 728 బిలియన్ డాలర్ల నుండి 688 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంటే సుమారు 40 బిలియన్ డాలర్ల నిల్వలు హరించుకుపోయాయి. మార్చి 27, 2026తో ముగిసిన వారంలో దేశ మొత్తం నిల్వలు 10.288 బిలియన్ డాలర్లు తగ్గి 688.058 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీనికి ముందు వారంలో కూడా 11.413 బిలియన్ డాలర్ల తగ్గుదల నమోదు కావడం గమనార్హం. ఫిబ్రవరి 27, 2026 నాటికి 728.494 బిలియన్ డాలర్ల సర్వకాలిక గరిష్ఠ స్థాయిలో ఉన్న నిల్వలు.. యుద్ధం కారణంగా వరుసగా రెండు వారాల పాటు భారీ క్షీణతను చూశాయి.నిల్వల తగ్గుదలకు ప్రధాన కారణాలను చూసినట్లయితే.. భారత విదేశీ మారక నిల్వల్లోని వివిధ విభాగాలు ఈ కాలంలో ఒత్తిడికి లోనయ్యాయి. రిజర్వులలో అతిపెద్ద భాగమైన ఎఫ్.సి.ఏ 6.622 బిలియన్ డాలర్లు తగ్గి 551.072 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల వల్ల బంగారు నిల్వల విలువ కూడా వారం వ్యవధిలో 3.666 బిలియన్ డాలర్లు తగ్గి 113.521 బిలియన్ డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో వీటి విలువ సుమారు ₹11.75 లక్షల కోట్లుగా ఉంది.ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడంతో డాలర్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇది రూపాయి విలువను పాతాళానికి నెట్టే ప్రమాదం ఉండటంతో, రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగింది. రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి ఆర్‌బిఐ తన వద్ద ఉన్న డాలర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించింది. ఈ వ్యూహాత్మక జోక్యం వల్లే తగ్గినప్పటికీ, రూపాయి విలువ స్థిరంగా ఉండగలిగింది. ఆర్‌బిఐ తీసుకున్న సత్వర చర్యల వల్ల రూపాయి రికార్డు స్థాయి నుండి తిరిగి కోలుకోవడం విశేషం.భారతదేశం తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల నుంచే పొందుతుంది. యుద్ధం వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే, దిగుమతి బిల్లు పెరిగి కరెంట్ అకౌంట్ లోటు హెచ్చయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మన వద్ద ఉన్న రూ. 65 లక్షల కోట్ల విలువైన విదేశీ మారక నిల్వలు దేశానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తున్నప్పటికీ, యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే ఈ నిల్వలు మరింత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే ఇరాన్ యుద్ధం కారణంగా ఏర్పడిన భౌగోళిక రాజకీయ అనిశ్చితి భారత ఆర్థిక పటిష్టతను పరీక్షిస్తోంది. ఆర్‌బిఐ తన వద్ద ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ రూపాయిని కాపాడుతున్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడితేనే దేశ ఆర్థిక స్థితిగతులు తిరిగి గాడిలో పడే అవకాశం ఉంది.

# బెంగళూరులో తీవ్రమైన ఎల్‌పీజీ సంక్షోభం

## సగం గ్యాస్ స్టేషన్లు మూత..ఆటో డ్రైవర్లు విలవిల



బెంగళూరు నగరంలో ఆటో ఎల్‌పీజీ సంక్షోభం అత్యంత తీవ్ర స్థాయికి చేరుకుంది. నగరంలోని మొత్తం గ్యాస్ స్టేషన్లలో దాదాపు సగం మూతపడటంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ కొరత శుక్రవారం (ఏప్రిల్ 3, 2026) నాటికి మరింత ముదిరింది. నగరంలోని గ్యాస్ పంపుల వద్ద కిలోమీటర్ల కొద్దీ బారులు తీరిన ఆటో రిక్షాలు ఇప్పుడు సర్వసాధారణ దృశ్యంగా మారాయి.బెంగళూరులోని ప్రైవేట్ గ్యాస్ ఏజెన్సీల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. 'టోటల్ గ్యాస్' తన అన్ని అవుట్‌లెట్‌లను పూర్తిగా మూసివేసింది. ఇక 'సూర్య గ్యాస్', 'సూపర్ గ్యాస్' వంటి స్టేషన్లలో స్టాక్ మధ్యాహ్నం లోపే అయిపోతోంది. ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్థాన్ పెట్రోలియం , భారత్ పెట్రోలియం కేంద్రాల వద్ద కూడా గ్యాస్ కోసం ఆటోలు 3 కిలోమీటర్ల మేర క్యూలో నిలబడుతున్నాయి. అయినప్పటికీ, గంటల తరబడి వేచి చూసిన డ్రైవర్లకు నిరాశే ఎదురవుతోంది. స్టాక్ లేదంటూ సిబ్బంది వారిని వెనక్కి పంపుతున్నారు.ఒక ప్రైవేట్ గ్యాస్ స్టేషన్ మేనేజర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజులుగా వారికి అసలు స్టాక్ అందలేదు. సాధారణంగా రోజుకు నాలుగు టన్నుల గ్యాస్ వచ్చే చోట, గత వారం అది రెండు టన్నులకు పడిపోయి, ఇప్పుడు సున్నాకు చేరింది. గ్యాస్ ధరలు కూడా గతంలో లీటరుకు రూ. 58 ఉండగా.. ఇప్పుడు అవి విపరీతంగా పెరగడం పెట్టుబడిదారులపై అదనపు భారాన్ని మోపుతోంది.భారీగా పెరిగిన ఎల్‌పీజీ సిలిండర్ ధరలు..లబోదిబోమంటున్న వ్యాపారులు..ఎంత పెరిగిందంటే..భారీగా పెరిగిన ఎల్‌పీజీ సిలిండర్ ధరలు..లబోదిబోమంటున్న వ్యాపారులు..ఎంత పెరిగిందంటే..ఈ సంక్షోభం ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీస్తోంది. గ్యాస్ దొరుకుతుందనే ఆశతో తెల్లవారుజామున 5 గంటల నుంచే క్యూలో నిలబడుతున్నామని, కానీ మధ్యాహ్నం వరకు వేచి చూసినా ఫలితం ఉండటం లేదని వారు వాపోతున్నారు. కృష్ణస్వామి అనే డ్రైవర్ మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం నింపుకున్న గ్యాస్‌తోనే నడుపుతున్నానని, ఇప్పుడు అది అయిపోవచ్చినందున ప్రయాణికులను తీసుకెళ్లడానికి భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో డ్రైవర్ శరవణ మాట్లాడుతూ.. గంటల తరబడి వేచి ఉంటే కేవలం 5 లీటర్లు మాత్రమే ఇస్తున్నారని, అది కేవలం 40-50 కిలోమీటర్లకే వస్తుందని చెప్పారు.మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఎల్‌పీజీ సరఫరా గొలుసు దెబ్బతినడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రైవేట్ గ్యాస్ కంపెనీలు ఎక్కువగా దిగుమతులపై ఆధారపడటం వల్ల వాటిపై ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ కొరత వల్ల బెంగళూరు రోడ్లపై ఆటోల సంఖ్య తగ్గిపోయింది, దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది ప్రయాణికులు ఎలక్ట్రిక్ ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, దీవఅస్త్రుశ్రీబతీబ లో అప్పులు చేసి ఆటోలు కొనుక్కున్న డ్రైవర్లు ఈఎంఐలు , ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని డ్రైవర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జీతం పెరిగినా చేతికి వచ్చే డబ్బు తగ్గుతుందా



## కొత్త టాక్స్ రూల్స్‌లో అసలు ట్విస్ట్ ఇదే!

సాధారణంగా ఉద్యోగంలో జీతం పెరిగితే ఎవరైనా సంతోషిస్తారు. కానీ మన దేశంలోని కొత్త ఆదాయపు పన్ను విధానం ప్రకారం, కొన్నిసార్లు స్వల్పంగా పెరిగిన జీతం మీ జేబుకు చిల్లు పెట్టవచ్చు. అంటే, మీకు పెరిగిన జీతం కంటే మీరు కట్టే పన్ను ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. దీనినే ట్యాక్స్ పరిభాషలో 'మార్జినల్ రిలీఫ్' సమస్య అంటారు. అసలు ఈ నిబంధన ఏమిటి? పెరిగిన జీతం వల్ల పన్ను భారం పెరగకుండా ఎలా జాగ్రత్త పడాలో ఇప్పుడు చూద్దాం.రెండు వేర్వేరు సందర్భాలు - షాకింగ్ నిజాలుఒక చిన్న ఉదాహరణతో దీనిని అర్థం చేసుకుందాం. కొత్త ట్యాక్స్ విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రిబేట్ లభిస్తుంది.సందర్భం 1: ఒక వ్యక్తి వార్షిక ఆదాయం రూ.13.40 లక్షలు అనుకుందాం. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000 పోగా, పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.12.65 లక్షలు అవుతుంది. దీనిపై లెక్కల ప్రకారం రూ.69,750 పన్ను పడుతుంది. కానీ ఆదాయం రూ.12 లక్షల కంటే కేవలం రూ.65,000 మాత్రమే ఎక్కువగా ఉంది కాబట్టి, ప్రభుత్వం 'మార్జినల్ రిలీఫ్' ఇచ్చి పన్నును రూ.65,000 కి తగ్గిస్తుంది.సందర్భం 2: ఇప్పుడు అదే వ్యక్తి జీతం రూ.13.50 లక్షలకు పెరిగింది అనుకుందాం (కేవలం రూ.10,000 పెంపు). ఇప్పుడు ట్యాక్సబుల్ ఇన్కమ్ రూ.12.75 లక్షలు అవుతుంది. దీనిపై పన్ను రూ.71,250 పడుతుంది. ఇక్కడ మార్జినల్ రిలీఫ్ వర్తించదు.అంటే.. కేవలం రూ.10,000 జీతం పెరగడం వల్ల, ఆ వ్యక్తి అదనంగా రూ.6,250 పన్ను కట్టాల్సి వస్తోంది. అంటే పెరిగిన జీతంలో 60 శాతం పైగా పన్ను రూపంలోనే పోతుందన్నమాట!మార్జినల్ రిలీఫ్ ఎందుకు ఇస్తారుఒక వ్యక్తి ఆదాయం రూ.12,00,000 ఉంటే పన్ను సున్నా. అదే రూ.12,01,000 ఉంటే వేలల్లో పన్ను కట్టాల్సి వస్తే అది అన్యాయం అవుతుంది. అందుకే, పెరిగిన ఆదాయం కంటే పన్ను ఎక్కువగా ఉండకూడదని ప్రభుత్వం ఈ ఉపశమనాన్ని ఇస్తుంది. అయితే, ఇది ఒక నిర్దిష్ట పరిమితి వరకు మాత్రమే పనిచేస్తుంది. ఆ పరిమితి దాటిన వెంటనే పూర్తి పన్ను భారం పడుతుంది.పన్ను భారం తగ్గించుకోవడానికి చిట్కాలుకొత్త లో ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ అదనపు భారం నుంచి తప్పించుకోవచ్చు..స్టాండర్డ్ డిడక్షన్ వాడకం: రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను సరిగ్గా ఉపయోగించుకుని మీ ట్యాక్సబుల్ ఆదాయాన్ని తగ్గించుకోండి.బోనస్ ప్లానింగ్: ఒకవేళ మీ ఆదాయం ట్యాక్స్ కి దగ్గరగా ఉంటే, బోనస్‌లు లేదా ఇతర వేరియబుల్ పేమెంట్లను తదుపరి ఆర్థిక సంవత్సరానికి వాయిదా వేయడం గురించి ఆలోచించండి.పాత వర్సెస్ కొత్త విధానం: మీ పెట్టుబడులు, మినహాయింపులను బట్టి పాత పన్ను విధానం మేలో లేక కొత్తదో ముందే లెక్కించుకోండి.స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్: ఆదాయం పెరిగినప్పుడు వచ్చే పన్ను చిక్కులను నివారించడానికి ట్యాక్స్ సేవింగ్ ఆప్షన్లను సరిగ్గా ఎంచుకోండి.జీతం పెరగడం ఎప్పుడూ శుభపరిణామమే, కానీ ఇలాంటి పన్ను మెలికలు తెలియనప్పుడు అది మనకు తెలియకుండానే ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుంది. కాబట్టి, ట్యాక్స్ ప్లానింగ్ విషయంలో నిపుణుల సలహా తీసుకోవడం ఎప్పుడూ ఉత్తమం.

# జాబ్ పోయినా నాకు టెన్షన్ లేదు! ఎందుకంటే

## బెంగళూరు టెక్కీ వైరల్ పోస్ట్!



సాధారణంగా ఎవరికైనా ఉద్యోగం పోయిందంటే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. కానీ, బెంగళూరుకు చెందిన ఒక ఐటీ ప్రొఫెషనల్ మాత్రం, "నా ఉద్యోగం పోయింది, నేను చాలా సంతోషంగా ఉన్నాను" అంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా బెంగళూరు వంటి నగరాల్లో ఇల్లు కొనాలా? లేక అద్దెకు ఉండాలా? అనే సందిగ్ధంలో ఉన్నవారికి ఈయన అనుభవం ఒక పెద్ద కనువిప్పుగా మారింది. ఇంతకీ అసలేం జరిగిందంటే..ఈఎంఐ కంటే ఫ్లెక్సిబిలిటీ ముఖ్యం!ఆ టెక్కీ తన రెడ్డిట్ పోస్ట్ లో ఏం చెప్పాడంటే.. "గత ఏడాది నేను బెంగళూరులో ఒక 3 ఇల్లు కొనాలని వెతికాను. నా నెట్ వర్త్ చూసుకుంటే రూ. 2 కోట్ల విలువైన ఇంటిని సులభంగా కొనగలను. కానీ, నేను అప్పుడు మైగ్రేషన్ టీమ్ లో పని చేస్తున్నాను. రాబోయే 2 - 3 ఏళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఐటీ రంగంలో ఎలాంటి మార్పులు వస్తాయో నాకు ముందే తెలుసు. అందుకే ఆఫీస్ నుంచి గంట దూరం ప్రయాణం చేస్తూ భారీ ఈఎంఐలు కట్టడం కంటే, ఆఫీస్ దగ్గర్లోనే అద్దెకు ఉండాలని నిర్ణయించుకున్నాను. సరిగ్గా గత వారం నా ఉద్యోగం ఊడింది. ఇప్పుడు నా తలపై ఈఎంఐ ల భారం లేదు కాబట్టి, ప్రశాంతంగా నా తర్వాతి కెరీర్ గురించి ఆలోచించుకోగలుగుతున్నాను" అని చెప్పుకొచ్చాడు.బెంగళూరు రియల్ ఎస్టేట్ బుడగ పేలుతుందాఈ పోస్ట్ పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. బెంగళూరులో 70-80 శాతం ఇళ్ల కొనుగోలుదారులు ఐటీ ఉద్యోగులే. సర్వీస్ బేస్డ్ కంపెనీల్లో ఉద్యోగ భద్రత తగ్గుతున్న ఈ తరుణంలో, భారీ అప్పులు చేసి ఇళ్లు కొనడం ఆత్మహత్యాసదృశ్యమని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఒక యూజర్ అయితే, "గ్లోబల్ యుద్ధాలు, ప్రభావం, మార్కెట్ లో పెరుగుతున్న ఇళ్ల సరఫరా చూస్తుంటే.. ఇప్పుడు కొనడం కంటే మరో రెండేళ్లు వేచి చూడటమే మంచిది" అని కామెంట్ చేశారు. మరికొందరు బిల్డర్లు కావాలనే 'స్టాక్ అయిపోయింది' అని అబద్ధాలు చెబుతూ ధరలను పెంచుతున్నారని ఆరోపించారు.నిపుణులు ఏమంటున్నారుఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నగరాల్లో ఇల్లు కొనేవారు తమ ఆదాయంలో అధిక భాగం ఈఎంఐలకే కేటాయించడం వల్ల ఆర్థికంగా బలహీనపడుతున్నారు. ఉద్యోగం పోవడం లేదా అనారోగ్యం వంటి అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు, భారీ అప్పులు ఉన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని హెచ్చరిస్తున్నారు. బెంగళూరు లోని మౌలిక సదుపాయాలు, నీటి సమస్యలు చూస్తుంటే, కోట్లాది రూపాయలు పెట్టి ఇల్లు కొనడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.మొత్తానికి ఆ టెక్కీ చెప్పినట్లుగా.. భవిష్యత్తు అస్పష్టంగా ఉన్నప్పుడు భారీ ఆర్థిక బాధ్యతలు నెత్తిన వేసుకోకుండా, ప్రశాంతంగా ఉండటమే 'పీస్ ఆఫ్ మైండ్' అనిపిస్తోంది. ఈఎంఐ ల ఉచ్చులో పడకుండా ఉండటమే నేటి కాలంలో అసలైన సక్సెస్ అని ఐటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఫ్లైట్ టికెట్స్ బుక్ చేస్తున్నారా

## సీట్ సెలెక్షన్ రూల్‌పై కేంద్రం సరికొత్త నిర్ణయం!





విమాన ప్రయాణం చేసే వారికి కేంద్ర ప్రభుత్వం ఒక చేదు వార్త వినిపించింది. కేవలం మూడు వారాల క్రితం ప్రయాణికుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన ఒక కీలక నిబంధనను ఇప్పుడు ప్రభుత్వం అకస్మాత్తుగా రద్దు చేసింది. విమానాల్లో కనీసం 60 శాతం సీట్లను ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా ప్రయాణికులకు కేటాయించాలని గత నెలలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.అసలు ఆ రూల్ ఏమిటి సాధారణంగా మనం ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకున్నప్పుడు, వెబ్ చెక్-ఇన్ సమయంలో నచ్చిన సీటును ఎంచుకోవాలంటే విమానయాన సంస్థలు అదనపు బాదుడు మొదలుపెడతాయి. కిటికీ పక్కన సీటు కావాలన్నా లేదా ముందు వరుసలో కూర్చోవాలన్నా భారీగా వసూలు చేస్తాయి. ప్రస్తుతం కేవలం 5 నుంచి 15 శాతం సీట్లు మాత్రమే ఉచితంగా అందుబాటులో ఉంటున్నాయి. దీనిని అరికట్టడానికి, ప్రతి విమానంలో 60 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని మార్చి 17న ప్రభుత్వం ఆదేశించింది. దీనివల్ల సామాన్య ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గుతుందని అందరూ భావించారు.వెనక్కి తగ్గడానికి కారణాలేంటిఈ నిబంధనను విమానయాన సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్ వంటి సంస్థలు ఉన్న 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్లైన్స్' , ఆకాశ ఎయిర్ ప్రభుత్వానికి లేఖలు రాశాయి. సీట్ సెలెక్షన్ ఫీజును రద్దు చేస్తే, ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి బేస్ ఫ్లైట్ టికెట్ ధరలను పెంచాల్సి వస్తుందని వారు వాదించారు. విమాన ఇంధన ధరలు పెరగడం, అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల విమాన రంగం ఇప్పటికే ఇబ్బందుల్లో ఉందని, ఇలాంటి నిర్ణయాలు మరింత భారం వేస్తాయని వారు వివరించారు. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం, ప్రస్తుతానికి ఈ ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్లు స్పష్టం చేసింది.ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశాలుఅయితే, 60 శాతం ఉచిత సీట్ల నిబంధనను రద్దు చేసినప్పటికీ, మార్చి 17 నాటి సర్క్యులర్‌లోని ఇతర అంశాలను మాత్రం ప్రభుత్వం కొనసాగిస్తోంది.కలిసి ప్రయాణించే వారికి ప్రాధాన్యత: ఒకే టికెట్ పై బుక్ చేసుకున్న కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు వీలైనంత వరకు పక్కపక్క సీట్లు కేటాయించాలని ఆదేశించింది.పారదర్శకత: క్రీడా సామాగ్రి, సంగీత పరికరాలు , పెంపుడు జంతువులను తీసుకెళ్లే విషయంలో స్పష్టమైన పాలసీలు ఉండాలని స్పష్టం చేసింది.ఛార్జీల వెల్లడి: సీట్ల కోసం వసూలు చేసే అదనపు ఛార్జీల వివరాలను బుకింగ్ సమయంలోనే స్పష్టంగా చూపాలని డిజిసిఎ ను కోరింది.మొత్తానికి విమాన ప్రయాణం చౌకగా మారుతుందని ఆశించిన సామాన్యులకు ఈ నిర్ణయం నిరాశ కలిగించే విషయమే. అయితే విమాన సంస్థల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది.



## ప్రభాస్ స్పిరిట్ కొత్త షెడ్యూల్ రేపే షురూ కానుందా..?

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ట్రాక్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్ యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. తాజా రిపోర్ట్స్ ప్రకారం స్పిరిట్ కొత్త షెడ్యూల్ రేపు షురూ కానుందట. ప్రభాస్, వివేక్ ఒబెరాయ్ మధ్య వచ్చే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో షూట్ చేయనున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు సుమారు 2 నెలలపాటు సుదీర్ఘంగా ఈ షెడ్యూల్ కొనసాగనుందట. ఇందులో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్‌గా నటిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. సందీప్ రెడ్డి వంగా హోం బ్యానర్ భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు. స్పిరిట్‌లో బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ (డాన్ లీ) మడాంగ్‌సియోక్ విలన్‌గా నటిస్తున్నాడని వార్తలు రాగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే క్లారిటీ వచ్చే అవకాశముంది.

## హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్..

### హాట్ టాపిక్‌గా కృతిసనన్ కామెంట్స్



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసా గుతుంది. ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యున రేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది. కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ కారణంగా, థియాట్రికల్ రెవెన్యూ పడిపోవడం కారణంగా నిర్మాతలు ప్రొడక్షన్ ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.



## వ్యాఖ్యాతగా మారిన శిల్పా శెట్టి..

బాలీవుడ్ నటి శిల్పా శెట్టి కుంద్రా వ్యాఖ్యాతగా 'మా హై నా' అనే సరికొత్త హిందీ కామెడీ కుకింగ్ షో త్వరలో ప్రారంభం కాబోతుంది. ఈ మేరకు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఆదివారం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మొత్తం పది ఎపిసోడ్ల పాటు సాగే ఈ సిరీస్‌లో ఆరుగురు సినీ సెలబ్రిటీలు తమ తల్లులతో కలిసి పాల్గొనబోతున్నారు. లిల్ ఫ్రోడో ప్రొడక్షన్స్ హౌస్ నిర్మిస్తున్న ఈ షోలో నేటి తరం యువత జీవనశైలికి మరియు తల్లుల సాంప్రదాయ ఆలోచనలకు మధ్య ఉన్న అనుబంధాన్ని వంటగది వేదికగా ఆసక్తికరంగా చూపించనున్నారు.

ఈ కార్యక్రమంలో సునీతా అహుజా-టీనా అహుజా, ఊర్వశి ధోలాకియా-క్షితిజ్ ధోలాకియా, తాన్య మిట్టల్-సునీతా మిట్టల్, గుల్లు-మునేష్ తన్వర్, షాహిదా అన్సారీ-అఫ్ఘాన్, మరియు భాగ్యశ్రీ శర్మ-రింజు శర్మలు జంటలుగా సందడి చేయబోతున్నట్లు తెలుస్తుంది. వంటలు చేస్తూనే ఒకరికొకరు ఎదురయ్యే భావోద్వేగాలు, చిన్నపాటి గొడవలు మరియు జ్ఞాపకాలను ఈ షో కళ్లకు కట్టనుంది. యువతకు మరియు వారి తల్లులకు మధ్య ఉండే ప్రత్యేక బంధాన్ని సరికొత్త కోణంలో చూపించడమే ఈ షో ఉద్దేశమని జీ5 హిందీ బిజినెస్ హెడ్ కావేరి దాస్ తెలిపారు. శిల్పా శెట్టి తనదైన శైలిలో ఈ షోకు మరింత వినోదాన్ని జోడించనున్నారని నిర్మాతలు నీతి మరియు ప్రీతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వినోదాత్మక కార్యక్రమం త్వరలోనే జీ5లో ప్రసారం కానుంది.

## 'మనీ హైస్ట్' ఫ్రాంచైజీ నుంచి మరో క్రేజీ సిరీస్.. అనౌన్స్‌మెంట్ టీజర్ విడుదల!



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్పెయిన్ సిరీస్ 'మనీ హైస్ట్' (లా కాసా డి పాపెల్) అభిమానులకు నెట్‌ఫ్లిక్స్ తీపి కబురు అందించింది. 2021లో ఐదు సీజన్లతో ఈ ఒరిజినల్ సిరీస్ ముగిసినప్పటికీ, ఈ ఫ్రాంచైజీని మరింత విస్తరించనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సిరీస్‌కి సంబంధించిన కొత్త టీజర్‌ను విడుదల చేసింది. మనీ హైస్ట్ ప్రపంచం కొనసాగబోతుంది అనే పేరుతో విడుదలైన కొత్త టీజర్ మరింత రసవత్తరంగా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సిరీస్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించబోతున్నట్లు తెలిపింది.



## చిరంజీవి ఆ దర్శకుడిని ఎందుకు కలిసినట్టు?

2017లో రీఎంట్రీ ఇచ్చిన తర్వాత చిరంజీవి నుంచి ఇప్పటివరకు 7 సినిమాలు చేస్తే అందులో మూడు రీమేక్‌లే. కానీ చిరుపై రీమేక్ హీరో ముద్ర చాలా గట్టిగా పడిపోయింది. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన 'మన శంకరవరప్రసాద్'కి బదులు ఓ రీమేక్ చేస్తారనే రూమర్స్ వచ్చాయి గానీ దాన్ని పక్కనబెట్టేశారు. ప్రస్తుతానికైతే ఎలాంటి రీమేక్స్ చేయట్లేదు. కానీ మలయాళ దర్శకుడు తరుణ్ మూర్తి.. చిరంజీవి ఇంటికొచ్చి కలవడంతో మళ్లీ రీమేక్ సందేహాలు వచ్చాయి. 'తుడురమ్' సినిమాతో హిట్ కొట్టిన మలయాళ దర్శకుడు తరుణ్ మూర్తి.. హైదరాబాద్ వచ్చి చిరుని కలిశాడు. అయితే ఎక్కడ రీమేక్ రూమర్స్ వస్తాయోనని ముందుగానే క్లారిటీ ఇచ్చేశాడు. 'తుడురమ్' రీమేక్ కోసం తాము కలవలేదని చెప్పాడు. ఆ ఫొటోలని సోషల్ మీడియాలో పంచుకున్నాడు. 'ఈ భేటీకి 'తుడురమ్' రీమేక్‌కి ఎలాంటి సంబంధం లేదు. చిరంజీవి టీమ్ నుంచి స్వయంగా కాల్ వచ్చింది. చిరంజీవి సర్ మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవాలనుకుంటున్నారు అని చెప్పడంతో విమానం ఎక్కేసి ఆయన ఇంటికి వచ్చేశా. ఆయనతో సినిమా, నా వ్యక్తిగత జీవితం తదితర విషయాల గురించి చాలాసేపు మాట్లాడుకున్నాం. నేను తీసిన ప్రతి సినిమాని ఎంతో శ్రద్ధగా చూసి, అందులోని ప్రతి సీన్ గురించి వివరించి చెబుతుంటే నాకే ఆశ్చర్యమేసింది. ఎంతటి సూపర్‌స్టార్ అయినా సరే సినిమాలని ఇప్పటికీ చిన్నపిల్లల్లా ఆసక్తితో చూస్తూ అదే ఉత్సాహంతో చర్చించడం చిరంజీవిగారి ప్రత్యేకత' అని తరుణ్ మూర్తి రాసుకొచ్చాడు. ఇది తన జీవితంలోనే అత్యంత మధురమైన, ఉత్సాహభరితమైన సందర్భాల్లో ఒకటని దర్శకుడు తరుణ్ చెప్పుకొచ్చాడు. అయితే చిరంజీవిని ఈ మలయాళ డైరెక్టర్ కలవడం గురించి సోషల్ మీడియాలో అప్పుడే డిస్కషన్స్ మొదలుపెట్టేశారు. త్వరలోనే కొత్త ప్రాజెక్ట్ గురించి అనౌన్స్‌మెంట్ ఉండొచ్చని అనుకుంటున్నారు. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న చిరంజీవి.. తర్వాత శ్రీకాంత్ ఓదెలతో కలిసి పనిచేస్తున్నారు. ఆ తర్వాత ఎవరితో చేస్తారనేది ప్రస్తుతానికైతే ఫిక్స్ కాలేదు. బహుశా ఆ ఛాన్స్.. మలయాళ డైరెక్టర్ తరుణ్ మూర్తి అందుకుంటాడేమో చూడాలి?

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.